

కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

ఆదివారం 30, ఆగస్టు 2026 16 పేజీలు



అంబేద్కర్ రాజ్యాంగంతోనే తెలంగాణ ఆవిర్భావం..!

2లో

సమన్యాయం అందిస్తున్న రాజ్యాంగం..

అంబేద్కర్ మహోన్నత మేధావి

దట్నూర్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ పేదల సంక్షేమమే కాంగ్రెస్

ప్రభుత్వ లక్ష్యం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి, ఆగస్టు 29 (ప్రభాతవార్త): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సాధ్యమైందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రాజ్యాంగం సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం, సమాన హక్కులు కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచం కొనియాడిన మహోన్నత మేధావి అంబేద్కర్ అని కొనియాడారు.గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం ఘనంగా ఆవిష్కరించారు. గ్రామానికి చేరుకున్న మంత్రికి అంబేద్కర్ సంఘం నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



2లో

కరెన్సీ కష్టాలు

కరీంనగర్ జిల్లాలో చిల్లర కరెన్సీ నోట్ల కొరత..

కష్టాల పాలవుతన్న జనం.. వ్యాపారులు

రూపాయి నాణెం మొదలుకుని..

20 రూపాయల వరకు బ్యాకుంల్లో నిల్..

పదికి 8రూపాయలు... చిల్లర క్యాష్ కటింగ్ దందా..



జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో 10 రూపాయలకు.. ఎనిమిది రూపాయలు.. 20రూపాయలకు 15 రూపాయల చిల్లర దందా వేములవాడ రాజరాజేశ్వర స్వామి గుడి మెట్ల మీద బిక్షాటన చేసే వారు భక్తులకు చెల్లిస్తూంటారు. అంతకుమించిన చిల్లర దందా కరీంనగర్ జిల్లాలో భారీ ఎత్తున జరుగుతుంది. ఒక్కరూపాయి (క్రైన్) నోటు మొదలుకుని 20 రూపాయల (క్రైన్) నోటు వరకు అటు ప్రభుత్వ. ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో సంవత్సర కాలంగా ఎక్కడ లభించడం లేదు. అనేక బ్యాంకులలో బ్యాంకు మేనేజర్‌లు, వారి సిబ్బంది ఆర్‌బిఐ నుండి సరిపడ ఇండెంట్ ఇచ్చి చిల్లర సొమ్ములు తీసుకోవడం మానేసారు.

పెద్దపల్లి జిల్లాలో దారి మళ్లిన

రూ.256 కోట్ల సీఎంఆర్ బియ్యం బకాయిలు

56 డిఫాల్ట్ మిల్లర్ల చేతివాటం

683372.27 క్వింటాల్ల బియ్యం మాయం

సీఎంఆర్ బియ్యం బకాయిలపై ప్రభుత్వం కఠిన చర్యలు

మంథనిలో ఇద్దరు డిఫాల్ట్ మిల్లర్లు అరెస్ట్



2లో

మంథని ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వంకు రైస్ మిల్లర్లు చెల్లించాల్సిన బియ్యం చెల్లించకుండా పక్కదారి పట్టించిన పెద్దపల్లి జిల్లాలోని 56 రైస్ మిల్లులపైన రాష్ట్ర ప్రభుత్వం కొరడా జులిపించింది. ప్రభుత్వం 2021 22 రబీ, ఖరీఫ్ సీజన్లో జిల్లాలోని 56 రైస్ మిల్లులకు 683372.27 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కేటాయించగా తిరిగి రైస్ మిల్లు బియ్యం రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది.

ఎస్ఐఆర్‌లో అనామలీస్, నో మ్యాపింగ్

ఓటర్లకు నోటీసులు అందించి పకడ్బందీగా విచారణ చేపట్టాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, వారితో పకడ్బందీగా విచారణ నిర్వహించాల ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల

2లో

కరీంనగర్ జిల్లలో చిల్లర కరెన్సీ నోట్ల కొరత.. కష్టాల పాలవుతన్న జనం.. వ్యాపారులు

రూపాయి నాణెం మొదలుకుని..

20 రూపాయల వరకు బ్యాకుంల్లో నిల్..

పదికి 8రూపాయలు... చిల్లర క్యాష్ కటింగ్ దందా..

జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో 10 రూపాయలకు.. ఎనిమిది రూపాయలు.. 20రూపాయలకు 15 రూపాయల చిల్లర దందా వేములవాడ రాజరాజేశ్వర స్వామి గుడి మెట్ల మీద బిక్షాటన చేసే వారు భక్తులకు చెల్లిస్తూంటారు. అంతకుమించిన చిల్లర దందా కరీంనగర్ జిల్లాలో భారీ ఎత్తున జరుగుతుంది. ఒక్కరూపాయి (కైన్) నోటు మొదలుకుని 20 రూపాయల (కైన్) నోటు వరకు అటు ప్రభుత్వ. ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో సంవత్సర కాలంగా ఎక్కడ లభించడం లేదు. అనేక బ్యాంకులలో బ్యాంకు మేనేజర్లు, వారి సిబ్బంది ఆర్బిఐ నుండి సరిపడ ఇండెంట్ ఇచ్చి చిల్లర సొమ్ములు తీసుకోవడం మానేసారు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం రానున్న 2027 జనవరి 1నుండి ఇప్పుడు చలామనీలో ఉన్న ఒకటి, రెండు, ఐదు, పది, 20 రూపాయల నోట్ల స్థానంలో పటిష్టమైన రెయాన్, డెకరాన్ లాంటి (ప్లాస్టిక్) చెక్కు చెదరని నోట్లను ముద్రించి, మార్కెట్‌లోకి తీసుకురావడానికి రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియాను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దీనితో గత సంవత్సర కాలంగా ఒక రూపాయి నోటు మొదలుకుని 2, 5, 10, 20 నోట్లను ముద్రించడం నిలుపుదల చేసి దేశవ్యాప్తంగా మార్కెట్‌లో ఉన్న చిల్లర నోట్లను బ్యాంకులకు వచ్చిన ఈ చిన్న నోట్లను కేంద్ర ప్రభుత్వం వెనక్కు రప్పించుకుంటుంది. దీనితో మార్కెట్‌లో సంవత్సర కాలానికిపైగా 10, 20నోట్లు ప్రజలకు కనిపించక మార్కట్‌లో వారి అవసరాలకు సరిపడ, చిల్లర ఎక్కడ లభించక.. ప్రజలు, వ్యాపార, వాణిజ్య వర్గాలు మొదలుకుని పాన్‌షాపు, కిరాణ దుకాణాల్లో చిల్లర నాణేల, నోట్ల కోసం జనం అనేక ఇక్కట్లకు గురవుతున్నారు.

ఎక్కడకు బ్యాంకులకు వెళ్లిన బ్యాంకులలో 50, 100, 200, 500 నోట్లు మాత్రమే ఖాతాదారులకు బ్యాంకులు చెల్లిస్తున్నాయి. ఆ చెల్లింపుల నగదులు ఆర్‌బిఐ నిబంధనలకు లోబడి జరుగుతున్నాయి. ఏ ఖాతాదారునికైన ఒక లక్ష రూపాయల వరకు సులభంగా చెల్లిస్తున్నారు. పరపతి ఉన్నవారికి రెండు లక్షల పై చిలుకు నగదులు చెల్లిస్తున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులకు ఎలాంటి నిబంధనలు లేవు. ఇంత వరకు బాగానే ఉంది..

చిల్లర కోసం క్యాష్ కట్టింగ్‌లు..

కరీంనగర్ పాత జిల్ల పరిధిలోని కరీంనగర్ వ్యాపార కేంద్రమైన జమ్మికుంట, హుజురాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, వేములవాడ, కోరుట్ల, మెట్‌పల్లి, సుల్తానాబాద్, రామగుండం, గోదావరిఖని లాంటి వ్యాపార కేంద్రాలతో పాటు ఆయా మండల కేంద్రాలలో పదులు, ఇరవై రూపాయల నోట్ల కోసం కొంతమంది గ్రూప్‌లుగా ఏర్పడి గత ఆరు మాసాలుగా గ్రామాలలోను, మండల కేంద్రాలలోను, జిల్లా వ్యాపార కేంద్రాలలో బ్రాండీ షాపులు, చిన్న, చితక కిరాణషాపులు, ఇతరత్ర మద్యం అమ్మే బెల్ట్‌షాపులు, పాన్‌షాపుల నుండి నిత్యం పదులు, ఇరవై నోట్లు (నాణేలు) సేకరిస్తూ నూటికి 20 రూపాయలు క్యాష్ కటింగ్‌తో దందా నిర్వహిస్తున్నారు. అనేక కిరాణ షాపులలో సూపర్ మార్కెట్‌లలో చిల్లర లేక.. వాటి బదులు అవసరంలేని ఇతర వస్తువులను వ్యాపారులు వినియోగదారులకు బలవంతంగా కట్టబెడుతున్నారు. మరో పక్క పొద్దంత సేకరించిన చిల్లర, కరెన్సీ నోట్లను నూటికి 20 రూపాయలు క్యాష్ కటింగ్ చేస్తూ, అవసరమున్న వ్యాపార కేంద్రాలలో అప్పగిస్తున్నారు. చిల్లర కరెన్సీ నోట్లు ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. 5 రూపాయలు మొదలుకుని, 20 రూపాయల వరకు నెట్ బ్యాంకింగ్ అవగాహన కల్గిన వారు డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ఆ అవకాశం లేని వారు టీ కొట్టులో, కూరగాయల మార్కెట్‌లో చిల్లర కోసం అష్టకష్టాల పాలవుతున్నారు.

తక్షణమే ఆర్‌బిఐ చిల్లర కొరత తీర్చాలి.. ప్రజల డిమాండ్

కాగితపు నోట్ల కరెన్సీ కొంత కాలానికి చిరిగిపోతుండడంతో ఆర్‌బిఐకి వస్తున్న ఫిర్యాదులతో కేంద్ర ప్రభుత్వం ఆ నోట్ల స్థానంలో రెయాన్, డెకరాన్ (ప్లాస్టిక్) నోట్లను, తీసుకువచ్చే ఆలోచన మంచిదే అయినప్పటికి సంవత్సర కాలంగా అటు దేశంలోను, ఇటు తెలంగాణ రాష్ట్రంలోను ప్రజలు చిల్లర సొమ్ములు అనుకున్నంత అందుబాటులో, అనుకూలంగా లభ్యం కాకపోవడంతో ప్రజలు ప్రభుత్వంపై నిస్సాహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఆ కొత్త నోట్లు వచ్చే వరకు ఆర్‌బిఐ దగ్గర ఉన్న వేల కోట్ల చిల్లర నాణేలను బ్యాంకులకు సరఫరా చేసి ఖాతాదారులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల రీజనల్ మేనేజర్‌లు, బ్యాంకుల మేనేజర్లు శ్రమ అనకోకుండా రిస్క్ తీసుకుని సరిపడ చిల్లర నాణేలను అంత వరకు ప్రజలకు సరఫరా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెద్దపల్లి జిల్లాలో దారి మళ్లిన రూ.256 కోట్ల సీఎంఆర్ బియ్యం బకాయిలు

56 డిఫాల్ట్ మిల్లర్ల చేతివాటం

683372.27 క్వింటాల్ల బియ్యం మాయం

సీఎంఆర్ బియ్యం బకాయిలపై ప్రభుత్వం కఠిన చర్యలు

మంథనిలో ఇద్దరు డిఫాల్ట్ మిల్లర్లు అరెస్ట్

మంథని ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వంకు రైస్ మిల్లర్లు చెల్లించాల్సిన బియ్యం చెల్లించకుండా పక్కదారి పట్టించిన పెద్దపల్లి జిల్లాలోని 56 రైస్ మిల్లులపైన రాష్ట్ర ప్రభుత్వం కొరడా జులిపించింది. ప్రభుత్వం 2021 22 రబీ, ఖరీఫ్ సీజన్లో జిల్లాలోని 56 రైస్ మిల్లులకు 683372.27 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కేటాయించగా తిరిగి రైస్ మిల్లు బియ్యం రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. కానీ 56 రైస్ మిల్లర్లు వివిధ కారణాలను చూపెట్టి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా దానికి బదులు సుమారు రూ.256 కోట్లు చెల్లించకుండా డిఫాల్ట్ గా మిగిలారు. గత మూడు సంవత్సరాల నుండి సదరు రైస్ మిల్లర్లు కోర్టుల ద్వారా, వివిధ మార్గాల ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులను ఎగ్గొట్టే విధంగా పథకాలు రూపొందించారు. కాగ దీనిపైన రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా తీసుకొని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ డిఫాల్టర్ల నుండి డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ను రంగంలోకి దించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధించిన అధికారులు జిల్లాలోని డిఫాల్ట్ రైస్ మిల్లులపైన విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగానే మంథని మండలంలోని రావికంటి పవన్ కుమార్ యాజమాన్యంలోని పవన సుత రైస్ మిల్‌కు ఖరీఫ్, రబీ 202122 సీజన్లలో మొత్తం 5,798.080 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా, దానికి సమానంగా 3,891.295 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉందని తెలిపారు. అయితే మిల్లర్ ఇప్పటివరకు 1,069.380 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే ఎఫ్‌సీఐ/టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు అందించారు. దీంతో 2,821.915 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి ఉన్నారు.ఇది 4,211.813 మెట్రిక్ టన్నుల సమాన ధాన్యానికి సమానము , దీని విలువ రూ.9,82,51,492గా ఉందని పేర్కొన్నారు. 25 శాతం పెనాల్టీ రూ.2,45,62,873 కలిపి మొత్తం డిఫాల్ట్ మొత్తం రూ.12,28,14,365గా అధికారులు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి పీపీసీల ద్వారా సమర్పించిన ట్రక్ చిట్టీలు, జాయింట్ సంతకాలను అధికారులు పరిశీలించగా, శ్రీలక్ష్మి ఎంఆర్ఎం, సూరయ్యపల్లికి చెందిన భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్ సంతకాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ట్రక్ చిట్టీల్లో నవీన్ సంతకాలు ఉన్న నేపథ్యంలో ఆయన పాత్రపై కూడా కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. పవన సుత రైస్ మిల్ యాజమాని రావికంటి పవన్ కుమార్, శ్రీలక్ష్మి ఎంఆర్ఎం భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు చేసి పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్ బియ్యం విషయంలో డిఫాల్ట్‌కు పాల్పడిన మిల్లర్లపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసులు, రికవరీ తదితర చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ స్పష్టం చేయటంతో జిల్లాలోని 56 డిఫాల్ట్ రైస్ మిల్ యజమానులు ఈ కేసుల నుండి బయట పడడానికి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వానికి రైస్ మిల్లర్ల నుండి రావలసిన బకాయిలను వసూలు చేయడానికి శ్రీకారం పెట్టడంతో ప్రజల్లో హర్షం వ్యక్తం గాక డిఫాల్టర్ల వెనుల్లో వణుకు పుట్టిస్తుంది.

ఎస్ఐఆర్‌లో అనామలీస్, నో మ్యాపింగ్

ఓటర్లకు నోటీసులు అందించి పకడ్బందీగా విచారణ చేపట్టాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, వారితో పకడ్బందీగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.శనివారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, పంపిణీ, విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు. సమీకృత కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణశ్రీ తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు పంపిణీ చేయాలని సూచించారు. నోటీసులు అందించిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణకు పూర్తి అవకాశం కల్పించి, వారి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో సుమారు 19 వేల నో మ్యాపింగ్ ఓటర్లు, 1.22 లక్షల అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే నోటీసులు జనరేట్ చేసి, వాటి పంపిణీ ప్రక్రియను చేపట్టామని పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణ ప్రక్రియ కూడా కొనసాగుతోందని, నిర్దేశిత గడువులోగా విచారణను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలోని ప్రతి వివరాన్ని నిశితంగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షిస్తూ, నిబంధనల ప్రకారం అనామలీస్, నో మ్యాపింగ్ అంశాలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డిఓ గంగయ్య, సంబంధిత ఎన్నికల అధికారులు,పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగంతోనే తెలంగాణ ఆవిర్భావం!

మొదటిపేజీ తరువాయి

రాజ్యాంగమే సమానత్వానికి పునాది

అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం వల్లే దేశంలోని అన్ని వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.



పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే పేద, బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసిందని మంత్రి అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆలోచనల ఫలితంగానే దేశంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమల్లోకి వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.గత ప్రభుత్వం సంక్షేమ శాఖకు బకాయిగా ఉంచిన రూ.100 కోట్ల నిధులను విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతి విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

యువతకు శిక్షణ.. ఉన్నత విద్యకు ప్రోత్సాహం

ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువత ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. యువత అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

ధర్మపురి అభివృద్ధికి ప్రాధాన్యం

ధర్మపురి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ధర్మపురిలో డిగ్రీ కళాశాల మంజూరుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మంత్రి తెలిపారు. దట్నూర్ గ్రామంలో బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ సంఘ భవనాల నిర్మాణ పనులను కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి

సమాజంలో అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలన్న అంబేద్కర్ ఆశయాలను ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పేర్కొన్నారు. విద్య, సంక్షేమం, ఉపాధి రంగాల్లో వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెక్కం గంగారాం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్, జగిత్యాల జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దాసరి తిరుపతిగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి జెల్ల అనిల్, జిల్లా కార్యదర్శులు తాడగొండ విజయ్, చిర్ర దిలీప్, సర్పంచులు మ్యాక స్వామి, ముల్కల శిరీష-శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమాండ్లు, దట్నూర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మీసాల అంజయ్య, ఉపాధ్యక్షుడు బెక్కం రవి, గౌరవ అధ్యక్షుడు కాన్వెల్లి హనుమన్లు, ప్రధాన కార్యదర్శి కొల్లూరి స్వామి, కొల్లూరి రాజయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం

కరీంనగర్ ఎడ్యుకేషన్, ప్రభాతవార్త :



కరీంనగర్ (కొత్తపల్లి) లోని అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలను అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు ఒత్తిడిని తగ్గించి, విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు.వేడుకల్లో భాగంగా విద్యార్థులు గౌరవ వందనం సమర్పించగా, వారికి వాలీబాల్, ఫుట్‌బాల్, ఖో ఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్ వంటి పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

చదువులతో పాటు క్రీడలు అవసరం

-గ్రామీణ ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం

-ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో-ప్రభాతవార్త:



గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.హాకీక్రీడాకారుడు,భారతరత్న మేజర్ ధ్యాన్ చంద్ జయంతి జాతీయ క్రీడ దినోత్సవం సందర్భంగా జగిత్యాల స్వామి వివేకానంద మినీ స్టేడియం లో జిల్లా యువజన క్రీడలు శాఖ ఆధ్వర్యం లో నిర్వహించిన క్రీడా పోటీలను ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఇటీవల పదవి విరమణ పొందిన వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వ ప్రసాద్ ను సత్కరించారు..ఎమ్మెల్యే మాట్లాడుతూ హాకీ దిగ్గజం, భారతరత్న మేజర్ ధ్యాన్‌చంద్ గారు క్రీడా రంగానికి అందించిన సేవలు మనందరికీ స్ఫూర్తిదాయకం.చదువులతో పాటు క్రీడలు అవసరం..క్రీడలు కేవలం పతకాలు సాధించడానికి మాత్రమే కాదు. అవి విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి. గెలుపోటములను సమానంగా స్వీకరించడం నేర్పిస్తాయి.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడా మైదానాల ఏర్పాటు, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రోత్సాహం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోంది.జగిత్యాల మినీ స్టేడియం లో బాస్కెట్ బాల్ కోర్టు పూర్తి కి 10 లక్షలు మంజూరు చేస్తాం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు..క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగం.ఇండోర్ స్టేడియం ను విద్యార్థులు యువత ఉపయోగించుకోవాలి.జగిత్యాల నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎదగాలి. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఏదో ఒక క్రీడలో తప్పనిసరిగా పాల్గొనాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలి అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్,కమిషనర్ సత్య ప్రణవ్, డి వై ఎస్ ఓ రవి బాబు,కౌన్సిలర్ అరవ లక్ష్మీరాజు టీ ఎన్ జి ఓ అధ్యక్షులు నాగేందర్,జిల్లా రెవెన్యూ అధ్యక్షులు వకీల్,యూత్ నాయకులు జంగిలిశశి,ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తక్కళ్లపల్లి వద్ద బైక్ ప్రమాదం

-బూరుగుపల్లికి చెందిన అశోక్ దుర్మరణం

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

రాఖీ పండుగ వేడుకలు ఆ కుటుంబంలో నింపిన ఆనందం కాసేపటికే ఆవిరైపోయింది.బంధువుల ఇంట్లో పండుగ జరుపుకొని సంతోషంగా తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదం ఒకరి ప్రాణాలను బలితీసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మపురి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన కుదురుపాక అశోక్ రాఖీ పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు.వేడుకలు ముగిసిన తర్వాత శుక్రవారం రాత్రి బైక్‌పై తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు.రాత్రి సమయంలో తక్కళ్లపల్లి గ్రామ సమీపంలోని కల్వర్టు వద్దకు చేరుకోగానే సోమనపల్లికి చెందిన మామిడిపల్లి రమేష్ వేగంగా నడుపుతున్న బైక్,అశోక్ వాహనాన్ని ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అశోక్ తల,కాళ్లు,చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా,మార్గమధ్యలోనే శనివారం తెల్లవారుజామున అతడు కన్నుమూశాడు.మృతుడి భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త :



కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎ. నిరంజన్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఈనెల 21న మధ్యాహ్నం సమయంలో చొప్పదండి మండలం చిత్యాలపల్లికి చెందిన నడిపెల్లి మధుసూదన్ రావు తన బెలోనా కారును నడుపుతూ, అతనితో పాటు శ్రీహరి రావు ముందు సీటులో కూర్చొని కరీంనగర్ వైపు పనిమీద వెళ్తున్నారు. ఈ క్రమంలో తీగలగుట్టపల్లి నుంచి ఆరేపల్లి వెళ్లే రహదారిపై రోడ్డు పక్కన ఒక ట్రాక్టర్ ఉండగా, కారు డ్రైవర్ మధుసూదన్ రావు వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ట్రాక్టర్ పక్కనుంచి వెళ్లే సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు సీటులో కూర్చున్న బల్మూరి శ్రీహరి రావు (68) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నగునూరులోని ప్రతిమ మెడికల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు . శనివారం చికిత్స పొందుతున్న శ్రీహరి రావు మృతి చెందినట్లు పోలీస్ లు తెలిపారు . మృతుడి కుమారుడు బల్మూరి లక్ష్మీ నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు సి ఐ తెలిపారు.

నాణ్యతా లోపాలకు తావులేకుండా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

-మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్



పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి మున్సిపల్ 8వ వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, అసిస్టెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. పట్టణంలో విస్తృతంగా సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, పనుల్లో ఎలాంటి నాణ్యత లోపం లేకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డ్ కౌన్సిలర్ ఫరా నాజ్ సల్మాన్ పాల్గొని వార్డుకు సంబంధించి పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించి వాటిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్, వర్క్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహం కావడం లేదని యువకుడి ఆత్మహత్య

మానకొండూర్, ప్రభాతవార్త :



మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అల్లే రంజిత్ (25) అనే యువకుడు వివాహం కావడం లేదని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు శనివారం తెలిపారు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అల్లే లక్ష్మీబాయ్ నరసయ్య దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నాడు. కూతురుకు వివాహం జరిగింది. కుమారుడు అల్లే రంజిత్ కు వివాహం కావడంలేదని, దీంతో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఊరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి నరసయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నేరాలు-దారుణాలు

అటవీ భూముల ఆక్రమణకు యత్నం

చెట్లు నరికి భూమిని చదును చేస్తుండగా

పట్టుకున్న అటవీశాఖ అధికారులు

కొడిమ్యాల, ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం దమ్మాయపేట గ్రామ శివారులో అటవీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. అటవీ భూముల్లో చెట్లను నరికి భూమిని చదును చేస్తున్న సమయంలో సమాచారం అందడంతో అధికారులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. దమ్మాయపేట గ్రామానికి చెందిన తునికి నరసయ్య, తండ్రి పోచయ్య, బట్టపెల్లి పోతారం గ్రామానికి చెందిన ద్యావుల గణేష్ అటవీ భూములను ఆక్రమించుకునే ఉద్దేశంతో చెట్లను నరికి భూమిని చదును చేస్తున్నట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు డీఆర్వో దేవీదాస్ తెలిపారు. అనంతరం వారిని తహసీల్దార్ నరేష్ కుమార్ ఎదుట హాజరుపరచగా బైండోవర్ చేసినట్లు వెల్లడించారు. అటవీ భూముల ఆక్రమణకు పాల్పడినా, చెట్లను అక్రమంగా నరికినా చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలు గుర్తించిన ప్రజలు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ చర్యల్లో బీట్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, బేస్ క్యాంప్ సిబ్బంది రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య

గొల్లపల్లి, ప్రభాతవార్త :



అనారోగ్యంతో పాటు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చందోలి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చందోలి గ్రామానికి చెందిన జూట పోచయ్య (55) గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ, మతిస్థిమితం సరిగా లేకపోవడంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు అయితే ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు తెలిపారు.శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పోచయ్య ఉరి వేసుకునీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు మృతుడి కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు.

అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న లారీ పట్టి వేత

బోయిన్ పల్లి ప్రభాత వార్త:



అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న అక్రమ మట్టి లారీని పోలీసులు వెంకట్రావు పెళ్లి గ్రామంలో పట్టుకున్నట్లు తెలిపారు. అశోక్ లేలాండ్ లారీని పట్టుకొని తదుపరి చర్య నిమిత్తం బోయిన్ పల్లి ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎమ్మార్వో ముందు హాజరు పరిచినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

40వ వార్డులో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:జగిత్యాల పట్టణంలోని 40వ వార్డులో థైరా బేగం రేషన్ డీలర్ షాపులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొని లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో రేషన్ డీలర్ థైరా బేగం, లబ్ధిదారులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రీ సర్వే పనులను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత
నాన్ కెడస్ట్రాల్ రిసర్వే,ఎంజాయ్మెంట్ రీ సర్వే పనుల పరిశీలన

మేడిపల్లి, ప్రభాతవార్త:

మేడిపల్లి మండలం లోని దమ్మన్నపేట గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే, ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రీసర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయిందని, ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉందని, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సూచించారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు.ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు.సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామ ని పేర్కొన్నారు.గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకం



గా రీసర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్స్డ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.ప్రస్తుతం ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు.నడికుడగ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. రైతులు, గ్రామస్థుల అడిగిన సందేహాలకు తగిన సలహాలు,సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్‌రెడ్డి,తహసీల్దార్ నాగార్జున, సర్వేయర్ లు,రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని అడ్డంకులు ఎదురైనా గడి మైసమ్మ తల్లి గుడిని పునర్మిస్తాం

కోరుట్ల, ప్రభాతవార్త :

పట్టణంలోని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అనూప్ రావు స్వగృహంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుట్ల పట్టణంలోని అతి పురాతనమైన గడి మైసమ్మ గుడిని పునర్నిర్మించాలని గతంలో కమిషనర్ గా విన్నవించడం జరిగిందన్నారు.గుడికి తాత్కాలిక షెడ్డుని భారతీయ జనతా పార్టీ నిర్మించిందని,అట్టి నిర్మాణాన్ని 24 గంటల్లో మున్సిపల్ సిబ్బంది తొలగించారని, దానిని ఏ విధంగా తొలగించారని భారతీయ జనతా పార్టీ గతంలో కూడా ప్రశ్నించిందన్నారు.గడి బురుజులను ఆనుకొని ఉన్న మినీ ఫంక్షన్ హాల్ గాని సామిల్ డిపో, ఆయిల్ మిల్లు లపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేరని ప్రశ్నించారు.గుడి నిర్మాణానికి



ఎవరు అడ్డువచ్చిన కోరుట్ల పట్టణ ప్రజల సహకారంతో అన్ని పార్టీలను సమన్వయం చేసుకొని ఎన్ని శక్తులు అడ్డగించిన గుడి నిర్మాణం పూర్తి చేసి తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఎండోమెంట్ కన్వీనర్ మాడవేణి నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఎర్ర రాజేందర్ చెట్లపెల్లి సాగర్, మ్యాకల గణేష్, గందె నవీన్, ఉపాధ్యక్షులు గోనెల రాజశేఖర్, యువ మోర్చా అధ్యక్షులు దమ్మ సంతోష్, దళిత మోర్చా అధ్యక్షులు బెక్కం అశోక్,బీజేవైఎం నాయకులు దామశ్రవణ్ లు పాల్గొన్నారు.

వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలపై గ్రామసభలు

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :

కోరుట్ల మండలంలోని మాదాపూర్, పైడిమడుగు, జోగిన్ పల్లి గ్రామాల్లో వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ తయారీ కోసం మాదాపూర్ సర్పంచ్ జంగం భూలక్ష్మి, పైడిమడుగు సర్పంచ్ భూమేశ్వర్, జోగిన్ పల్లి సర్పంచ్ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వోదెలరామకృష్ణ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను ప్రజల భాగస్వామ్యంతో గుర్తించి వీజీపీపీ ప్రణాళికను రూపొందించాలని తెలిపారు. వీజీపీపీ లో గ్రామ అవసరాలు, అభివృద్ధి లోటుపాట్లను గుర్తించి ప్రాధాన్యత పనులను ప్రణాళికలో చేర్చనున్నట్లు వివరించారు. ప్రధానంగా నీటి భద్రత, కోర్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రామీణ



జీవనోపాధి, విపత్తుల నివారణ, తీవ్ర వాతావరణ ప్రభావాల ఉపశమన చర్యలు అనే అంశాలపై గ్రామసభల్లో అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు తమ గ్రామానికి అవసరమైన తాగునీరు, నీటి సంరక్షణ, రహదారులు, పారిశుధ్యం, మౌలిక వసతులు, ఉపాధి-జీవనోపాధి అవకాశాలు, ప్రకృతి విపత్తుల నివారణకు సంబంధించిన పనులను సూచించాలని ఎంపీడీవో కోరారు.ప్రజల సూచనలు, అవసరాల ఆధారంగా రూపొందించిన వీజీపీపీ ను గ్రామసభ ఆమోదంతో ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ను కలిసిన శ్రీనివాస్

కోరుట్ల, ప్రభాతవార్త:



కోరుట్ల పట్టణ గంగపుత్ర సంఘం ఎన్నికలు ఇటీవల జరగ గా ప్రధాన కార్యదర్శి గా పట్టణానికి చెందిన పందిరి శ్రీనివాస్ నియా మకమయ్యారు. ఇందులో భాగంగా శనివారం కోరు ట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌ల ను వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సన్మానించగా అనంతరం చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లు శ్రీనివాస్ ను కూడా శాలువాతో సన్మానించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లు మాట్లాడుతూ ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తమ దగ్గరకు వస్తే తప్పకుండా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు బొద్దురి సతీష్ కుమార్, సీనియర్ పాత్రికేయులు కటుకం గణేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



కోరుట్ల, ప్రభాతవార్త : ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా అనుబంధ కార్మిక సంఘాల సమావేశం సి ప్రభాకర్ భవన్ కోరుట్లలో అధ్యక్షులు ఏ గణేష్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మారగోని ప్రవీణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏఐటియుసి నాలుగవ మహాసభలు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో వచ్చేనెల 6 7 8 తేదీలలో జరుగుతున్నందున, మొదటి ఆరో తారీఖున జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు సుతారి రాములు, జగిత్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ.గణేష్, ఎండి ముక్రం, వర్కింగ్ ప్రెసిడెంట్ వెన్న మహేష్, ఉపాధ్యక్షులు కొక్కుల శాంత, కూన సరస్వతి, జిల్లా కోశాధికారి మేకల సాయి ఈశ్వరి, మహమ్మద్ ఉస్మాన్, రామిల్ల రాంబాబు, కిరణ్, శ్రీ గాద దేవదాస్, ఎన్నం రాధా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పిడుగురాళ్ల భూమేశ్వర్, మల్లాపూర్ రాజన్న, ఎండి హలీ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల వార్త



సాయి జీనియస్ హై స్కూల్ లో ఆరెంజ్ డే వేడుకలు

కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలోని సాయి జీనియస్ హై స్కూల్ లో ఆరెంజ్ డే ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పిల్లలు, ఉపాధ్యాయులు అందరూ ఆరెంజ్ కలర్ డ్రెస్ ధరించారు. పాఠశాల కరస్పాండెంట్ చౌకీ రమేష్ మాట్లాడుతూ ఆరెంజ్ రంగు ఉత్సాహం, ఆనందం, తాజాధనం చిహ్నం,ఈ రంగు ఎరుపు యొక్క శక్తిని పసుపు యొక్క సంతోషాన్ని కలిగిన రంగని,ఈ రంగులో దొరికే పండ్లు కూరగాయలను ఎక్కువ మోతాదులో తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఆరింజ,పప్పాయ క్యారెట్, గుమ్మడికాయ మొదలైనవని,వీటిలో విటమిన్ ఏ విటమిన్ సి, ఫైబర్ పొటాషియం లభిస్తాయన్నారు.వీటిని తీసుకోవడం వలన ఆరోగ్యంగా దృఢంగా వ్యాధి నిరోధకశక్తి కలిగి ఉంటాము కావున ప్రతి దినము ఏదైనా ఒక ఆరెంజ్ రంగులో ఉన్న కూరగాయలను తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

కోరుట్ల, ప్రభాతవార్త:



భారతీయ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కమిటీ అధ్యక్షులుగా కొంపల్లి సురేష్, ఉపాధ్యక్షులుగా రాచకొండ రోజా,ప్రధాన కార్యదర్శిగా సుతారి నవీన్, వ్యవస్థాపక కార్యదర్శిగా రసభక్తుల రాజశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా బొద్దు నరేష్, ముక్రముద్దీన్ హైదర్, కోశాధికారిగా రాస గౌతమ్, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా బద్ది నర్సయ్య,చిట్యాల లచ్చయ్య,కార్యవర్గ సభ్యులుగా రాములు వోర్సు,పూదరి ఉమా,రోజా రాణి, పద్మకళ,రంజిత, వినయ్ లు ఏకగ్రీవంగాఎన్నికయ్యారు.అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల ను జిల్లా అధ్యక్షులు మగ్గిడి నర్సయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మరిపల్లి గంగాధర్ లు శాలువాలతో సత్కరించారు.

వరి పంటల పరిశీలన

మేడిపల్లి, ప్రభాతవార్త :



మండలంలోని పోరుమల్ల గ్రామం లో వరి పంటలను మండల వ్యవసాయ అధికారి ఎం.డి. షాహిద్ అలీ పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటలో హిస్పా, మొగిపురుగు ఉధృతిని, పంట పరిస్థితిని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. హిస్పా నివారణకు పొలంలోని కలుపు మొక్కలను తొలగించి, పొల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అవసరానికి మించి నత్రజని ఎరువుల వినియోగాన్ని నివారించాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వ్యవసాయ శాఖ సూచించిన పురుగుమందులను లేబుల్ సూచనల మేరకు వినియోగించాలని తెలిపారు.మొగిపురుగు నివారణకు పంటను క్రమం తప్పకుండా పరిశీలించి డెడ్‌హార్ట్స్ లక్షణాలను గుర్తించాలని సూచించారు. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు అధికారుల సూచనల మేరకు తగిన నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు అవగాహన కల్పించారు.

కార్మికుల హక్కులపై రాజీ వద్దు

ఏఐటీయూసీ ఒప్పందాలపై స్పష్టత ఇవ్వాలి

మెడికల్ బోర్డులో 10-15 శాతానికే అన్‌ఫిట్

150 మస్టర్ల పేరుతో యువ కార్మికుల తొలగింపు

149 మంది డిపెండెంట్ల ఉద్యోగాలపై తేల్చాలి



గోదావరిఖని, ప్రభాతవార్త:

సింగరేణి కార్మికుల ప్రధాన సమస్యలు, హక్కులపై గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ రాజీ పడుతోందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు ఆరోపించారు. యాజమాన్యంతో కుదుర్చుకున్న ఒప్పందాల పూర్తి వివరాలను, సంబంధిత సర్క్యులర్లను కార్మికుల ముందుంచాలని డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి మాట్లాడారు.సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు ప్రకటించిన రూ.20 లక్షల పరిహారం గతంలో ఉన్న మ్యాచింగ్ గ్రాంట్, ప్రమాద బీమాకు అదనమా? కాదా? అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. గత రెండు సంవత్సరాల వాస్తవ లాభాలను పారదర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.మెడికల్ ఇన్వాలిడేషన్ విషయంలో గతంలో 100 శాతం మందికి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పిన ఏఐటీయూసీ ఇప్పుడు ఆ అంశాన్ని పట్టించుకోవడం లేదని మాదాసు రామమూర్తి ఆరోపించారు. నెలవారీ మెడికల్ బోర్డులు సక్రమంగా నిర్వహించడం లేదని, ఇటీవల జరిగిన బోర్డులో కేవలం 10 నుంచి 15 శాతం మందినే మెడికల్ అన్‌ఫిట్‌గా ప్రకటించారని తెలిపారు.100/150 మస్టర్ల నిబంధనల పేరుతో 200 మందికి పైగా కార్మికుల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని నాయకులు పేర్కొన్నారు. 150 మస్టర్లు లేవనే కారణంతో కొత్తగా చేరిన యువ కార్మికులను డిస్మిస్ చేస్తున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత రెండున్నరేళ్లలో డిస్మిస్ అయిన కార్మికుల పునర్నియామకంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.గనుల్లో డ్రిల్ బిట్లు, రెజిన్, సిమెంట్ క్యాప్సూల్స్, డాగ్ నెయిల్స్ వంటి ప్రాథమిక పనిముట్ల కొరత ఉందని, కార్మికులకు చట్టబద్ధంగా అందించాల్సిన రక్షణ పరికరాలపై యాజమాన్యం ప్రచారానికే పరిమితమవుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో ప్రతిపాదించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో వెల్లడించాలని, సీపీఆర్ఎంఎస్ కార్యదారులైన రిటైర్డ్ కార్మికులకు శస్త్రచికిత్సలను సైతం ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. బదిలీల్లో మూడేళ్ల నిబంధన రద్దు, మారుపేర్ల సవరణ, కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు, పెండింగ్‌లోని 149 మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.సింగరేణికి రావాల్సిన బకాయిలు, కార్మికుల వేతనాలు, క్వార్టర్ల సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని విస్మరిస్తే రానున్న రోజుల్లో కార్మికులే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.సమావేశంలో నూనె కొమరయ్య, పర్లపల్లి రవి, చెల్పూరి సతీష్, దూట శేషగిరి, వాసార్ల జోసెఫ్, రొడ్డ సంపత్, మురళీకృష్ణ, నూతి రాజ్‌కుమార్, సుసమని అనురాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించాలి

కరీంనగర్ హెల్త్, ప్రభాతవార్త :



పచ్చదనం పరిశుభ్రతను పెంపొందించి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు మ్యాడం శివకాంత్ అన్నారు. భారత దిగ్గజ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని శనివారం మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులలో క్రీడలు, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందాలన్నారు. దృడమైన శరీరంతోనే మానసిక ఆరోగ్యం సాధ్యం అని అన్నారు. యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బట్టు వినోద్, కె.చైతన్య, ఐతా సూరజ్, ముక్క శరత్ కృష్ణ, కోల అన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఐకమత్యంతో ఉండాలి

చిగురుమామిడి, ప్రభాత వార్త :చిగురుమామిడి మండలం రామంచ గ్రామం లో శనివారం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమము అంబేద్కర్ కూడలిలో గ్రామ సర్పంచ్ ఒంటెల కిషన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ రామ్మోహనచారి పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 17 ప్రకారం అంటరాని తనం అనేది పూర్తిగా నిర్మూలించడం, నిషేధించడం జరిగినదని, సమాజంలో పౌరులు అందరూ సమానమేనని,స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో అందరూ కలసి మెలిసి జీవించాలని, పౌరులు అందరూ చట్టాల పట్ల అవగాహన పెంచుకొని తదనుగుణంగా నడుచుకోవాలని,హోటల్ లో రెండు గ్లాసుల విధానంగానీ, ఆలయ ప్రవేశ విషయములో గానీ వివక్ష చూపవద్దని అలా ఎవరైనా వివక్ష చూపినట్లయితే చట్ట రీత్యా నేరం అని, అందుకు బాధ్యులు అవుదురుని తెలియపరచినారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఈ గ్రామములో అందరం సోదర భావముతో కలసి మెలసి జీవిస్తున్నామని తమ మధ్య బేధాభిప్రాయాలు లేవని తెలిపినారు.ఇట్టి కార్యక్రమంలో ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఏ ఈ ఓ ప్రణయ్, స్కూల్ హెడ్ మాస్టర్, హాస్టల్ వార్డెన్, ఆశా వర్కర్, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ ఎల్ ఎన్ లక్ష్యసాధనలో అందరం కలిసి పనిచేద్దాం

జిల్లా సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాధికారి చైతన్య జైనీ

కరీంనగర్ ఎడ్యుకేషన్, ప్రభాతవార్త :



రాష్ట్రంలో ప్రస్తుతం మిషన్ ప్రాతిపదికన ఎఫ్ ఎల్ ఎన్ ప్రగతి కోసం పనిచేస్తుండడంతో అందులో జిల్లా అగ్రగామిగా రావడానికి కావలసిన తీరుగా సమిష్టిగా అందరం పనిచేద్దామని జిల్లా విద్యాధికారి చైతన్య జైనీ మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో పిలుపునిచ్చారు. రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల బేస్ లైన్ టెస్ట్ ఫలితాల మీద ఇచ్చిన సమగ్ర రిపోర్టు మీద పూర్తిస్థాయి సమీక్ష జరిగింది. ఒక్కొక్క సబ్జెక్టులో ఒక్కొక్క సామర్థంలో జిల్లా స్థాయిలో కాంపిటెంట్, నాన్ కాంపిటెంట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రగతి మీద పరిశీలన జరిగి, దానికి తదనుగుణమైన విధంగా కార్యక్రమాలు నిర్వహించడంలో అధికారులు అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కాంపిటెంట్ స్కూళ్ళలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో త్వరలో ఒక ఓరియెంటేషన్ నిర్వహించి వారికి దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. వెనకబడి ఉన్న సామర్థ్యాల మీద అనుగుణమైన కార్యాచరణ ప్రణాళిక చేయాలని తెలిపారు. అలాగే ఏకరూప దుస్తులు, జిల్లా పరీక్షల నిర్వహణ, అపార్, స్పర్శ్ అంశాల మీద పూర్తిస్థాయిలో పనిచేయాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే జిల్లా విద్యాశాఖ దృష్టికి తేవాలని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం పూర్తిస్థాయి లక్ష్యం ఎఫ్ ఎల్ ఎన్ సాధన అని గుర్తెరిగి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్య సాధించినప్పుడే విద్య ప్రగతిశీలంగా ఉంటుందని సూచించారు.ఈ కార్యక్రమంలో క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఏ ఎమ్ ఓ శ్రీనివాస్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, డిసీఈబి సెక్రటరీ భగవంతయ్య , మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అకాడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు

ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఇంట్రా డిఈ జలంధర్ రెడ్డి

జగిత్యాలబ్యూరో ప్రభాతవార్త:ఆర్డబ్ల్యూఎస్ ఇంట్రా డి ఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జలంధర్‌రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఏఈ లు రాజశేఖర్ తరుణ్ రాహుల్ ఉన్నారు.



మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

చిగురుమామిడి, ప్రభాత వార్త:



చిగురుమామిడి మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన కుటుంబాలను హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్ పరామర్శించి, వారి మరణ వివరాలు అడిగి తెలుసుకుని మీకు ఎల్లప్పుడు అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని ధైర్యాన్ని కల్పించారు. మండల కేంద్రంలోనీ కోనేటి వెంకవ్వ సీతారాంపూర్, ముస్కుల వెంకటరెడ్డి, ఇందుర్తికి చెందిన బల్ల రాములు, గౌరవెల్లి లచ్చమ్మ, రేకొండ లో పరుపాటి వెంకవ్వ, రామంచ నర్రా జగదీశ్వర్ రెడ్డి మృతుల కుటుంబాల సభ్యులను ఓదార్చి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బేతి రాజి రెడ్డి, నాయకులు రామోజీ కృష్ణమాచారి, బెజ్జంకి రాంబాబు, సర్పంచ్ ఒంటెల కిషన్ రెడ్డి, చిగురుమామిడి ఉప సర్పంచ్ కాశ బోయిన విజయలక్ష్మి, గీట్ల తిరుపతిరెడ్డి,తాటికొండ అభిషేక్ రెడ్డి, తాటికొండ సందీప్ రెడ్డి, అందె సుజాత, అందే రాయమల్లు, మహంకాళి కొమురయ్య, అందె పోచయ్య, శ్యామకూర సంపత్ రెడ్డి, ఎస్ కే సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ కమిటీ చైర్మన్ రవిని పరామర్శించిన ఎమ్మెల్యే

తిమ్మాపూర్, ప్రభాత వార్త:



మాతృవియోగానికి గురైన మానకొండూర్ నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవిని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామంలో రెండు రోజుల కిందట అనారోగ్యంతో రవి తల్లి కొమురమ్మ మరణించగా, శనివారం ఎమ్మెల్యే పార్టీ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కొమురమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మన్నెంపల్లిలో.....ఇటీవల హఠాన్మరణం చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్ (ఎస్ఎల్ గౌడ్) కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం మరోమారు పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడి వారి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, ప్యాక్స్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు,పులి కృష్ణ,పోతుగంటి శ్రీనివాస్, పోలు రాము,రమేశ్, జక్కుల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఓదెల క్రీడాకారుడికి ఘన సన్మానం

ఓదెల,ప్రభాతవార్త:

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లోని ఐడీఓసీ హాల్‌లో మై భారత్-నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.ఈ క్రమంలో ఓదెల మండలం కనగర్తి గ్రామంలోని దాసరి పద్మా హన్మయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముద్దమళ్ల అజయ్ కుమార్ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయి గోల్డ్ మెడల్, బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయి బ్రాంజ్ మెడల్ సాధించినందుకు మై భారత్-నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి, మూమెంటోను అందజేశారు.అజయ్ కుమార్ క్రీడా రంగంలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, ఓదెల మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మై భారత్ యూత్ ఆఫీసర్, పెద్దపల్లి జిల్లా నోడల్ ఆఫీసర్ తులా శోభారాణి పాల్గొన్నారు.



రైతులకు ఆధునిక పద్ధతిలో సాగు చేయాలి

మల్లాపూర్ ఏవో లావణ్య

మల్లాపూర్, ప్రభాతవార్త:

మల్లాపూర్ మండలంలో రేగుంట గ్రామంలో శనివారం వ్యవసాయ శాఖ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ సహాయంతో నానో యూరియా నానో డిఎపి వినియోగంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి లావణ్య మాట్లాడుతూ నానోయూరియా సాంప్రదాయ రేణువుల యూరియా స్థానంలో, నానో టెక్నాలజీని ఉపయోగించి అభివృద్ధి చేసిన ఒక వినూత్న ద్రవ నత్రజని ఎరువు. 20-50 నానోమీటర్ల పరిమాణంలో ఉండే అతి సూక్ష్మ కణాలను కలిగి ఉండటం వలన, ఇది అధిక శోషణ రేటును కలిగి ఉంటుందన్నారు. ఆకులపై పిచికారీ చేసేటప్పుడు, ఆకులలోని పత్రరంధ్రాల ద్వారా నత్రజనిని నేరుగా మొక్క కణాలకు అందించి,80శాతం కంటే ఎక్కువ పోషక లభ్యత ను సాధిస్తుందని తెలిపారు. సంప్రదాయ స్ప్రేయర్ ల ఒక ఎకరానికి 200 లీటర్ల నీరు అవసరం అయితే డ్రోన్ ద్వారా ఒక ఎకరానికి 10 లీటర్ల నీరు



మాత్రమే సరిపోతాయని,మందు పనితీరు కూడా సమర్థవంతంగా ఉంటుందని రైతులు డ్రోన్ ద్వారా నానో యూరియా,డిఎపి పిచికారి చేసి ల బ్ధి పొందాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ తీట్ల లహరి,ఉప సర్పంచ్ గణవేణి నందిని,వ్యవసాయ విస్తరణ అధికారి వంశీ, వార్డు సభ్యులు కలసాని రాజన్న,కత్తి నరేష్,రైతులు సురకంటి శ్రీనివాస్,నల్ల రాజేశం,సామ లక్ష్మితిరెడ్డి,గనవెని మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త :



క్రీడల ప్రాధాన్యతను చాటిచెప్పడంతో పాటు విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో మెట్ పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవం (నేషనల్ స్పోర్ట్స్ డే)ను ఘనంగా నిర్వహించారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా ఆయన క్రీడా సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు కేక్ కట్ చేసి ధ్యాన్ చంద్‌కు ఘన నివాళులు అర్పించారు.అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న 10 మంది క్రీడాకారులు, విద్యార్థులతో పాటు మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ డి. సురేష్,ఆల్‌రౌండ్ స్పోర్ట్స్ ట్రైనర్ గంగాధర్లను లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెలుముల శ్రీనివాసరావు శాలువాలతో సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం,నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలో నిరంతరం సాధన చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు . కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జనరల్ సెక్రెటరీ బొమ్మెల శివ, క్యాషియర్ జోగ జగదీశ్వర్, సభ్యులు ఇల్లెందుల శ్రీనివాస్, బాస నరసింగరావు, మర్రి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం తో ఈత చెట్ల నడిమధ్యన పౌల్ట్రీ ఫారాలు

- పౌల్ట్రీ ఫారాల ఆగడాలు నిబంధనలకు విరుద్ధంగా కోళ్ల ఫారాలు
- వ్యర్థాలతో పృద్ధి చెందుతున్న ఈగలు
- దోమలు కోళ్ల ఫారాల బ్యాక్టీరియా తో కలుషితమవుతున్న ఈతకల్లు
- ఆందోళన చెందుతున్న గీత కార్మికులు

మల్లాపూర్,ప్రభాతవార్త:



మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామ శివారులోని ఈత వనాలు మధ్య



నిబంధనలకు విరుద్ధంగా కోళ్ల ఫారాలు ఏర్పాటు చేయడం వల్ల పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోంది ఫారాల నుండి వెలువడే ఘాటైన అమ్మోనియా వాయువు, ప్రమాదకర బ్యాక్టీరియా వల్ల ఈత చెట్లు నిలువునా ఎండిపోవడమే కాకుండా, లక్షలాది ఈగల కారణంగా కల్లు కలుషితమై గీతా కార్మికుల ఉపాధి దెబ్బతింటోంది. స్థానిక పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు (ఎమ్మార్వో), పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కోళ్ల ఫారాలను క్రమబద్ధంగా తనిఖీ చేయకపోవడం వల్ల యజమానులకు భయం లేకుండా పోయింది. దీనికి తోడు పరిసర ప్రాంతాల్లో విపరీతమైన దుర్వాసన రావడం, భూగర్భ జలాలు కలుషితమవ్వడం వల్ల స్థానికులు శ్వాసకోశ, అంటువ్యాధుల బారిన పడుతున్నారని,ఇలా కలుషితమైన కల్లును సేవించడం వల్ల ప్రజల్లో వాంతులు, విరేచనాలు, మరియు ఫుడ్ పాయిజనింగ్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.కోళ్ల ఫారాల విసర్జితాల వద్ద చేరే ఈగలు, కీటకాలు కల్లు కుండలపై వాలి బ్యాక్టీరియాను వ్యాప్తి చేస్తున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి కాలుష్య కారక పౌల్ట్రీలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

సంకల్ప సభ ఏర్పాట్లపై డా. రఘు ప్రత్యేక పర్యవేక్షణ

సభా ప్రాంగణం పరిశీలన.. ఏర్పాట్లపై సమీక్ష

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:



తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఈ నెల 31న నిజామాబాద్ లోని కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభ ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో నిర్వాహకులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. సభా పర్యవేక్షకులు, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. రఘు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.శుక్రవారం సభా ప్రాంగణాన్ని పరిశీలించిన డా. రఘు.. శనివారం మరోసారి గ్రౌండ్‌ను సందర్శించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. వేదిక నిర్మాణం, సభకు హాజరయ్యే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, పార్కింగ్, నాయకులు, కార్యకర్తల రాకపోకలు తదితర అంశాలను పరిశీలించారు.స్థానిక నాయకులు, సభ నిర్వాహక బృందంతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.సభ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో మిగిలిన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డా. రఘు కోరారు. సభ విజయవంతానికి ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తూ, భారీగా తరలివచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.

నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

బిసి రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి గడప కోటేష్ కుమార్

బోయిన్ పల్లి ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి గడప కోటేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చాలా రోజుల నుండి నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని నిరుద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు రాము గణేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి వార్త



పల్లె దవాఖానను త్వరగా ప్రారంభించాలి

మల్లాపూర్,ప్రభాతవార్త :



మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో నిర్మాణం పూర్తయిన పల్లె దవాఖాన (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మన నేస్తాం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బొడ్డు రాజేష్ శనివారం డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాతారం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో మాజీ సర్పంచ్ బొడ్డు సుమలత కృషితో, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సహకారంతో సుమారు రూ.20 లక్షల అంచనా వ్యయంతో పల్లె దవాఖాన మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి నోచుకోకపోవడం విచారకరమన్నారు.దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి గ్రామస్తులకు లేకుండా సాతారం పల్లెదవాఖానను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బొడ్డు రాజేష్ విజ్ఞప్తి చేశారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి భక్తుడి విరాళం

వేములవాడ, ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి, ఆలయ విస్తరణ పనులకు భక్తులు తమవంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తపల్లి (హవేలీ) గ్రామానికి చెందిన మహేందర్ కుమారుడు దూస రిషికేష్ ఆలయ అభివృద్ధి పనుల కోసం రూ.25వేలు విరాళంగా అందజేశారు. స్థానిక ప్రొటోకాల్ కార్యాలయంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మకు విరాళం మొత్తాన్ని అందజేసి, అనంతరం రశీదు పొందారు. రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులకు భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించడం అభినందనీయమని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధిలో భక్తుల భాగస్వామ్యం మరింత పెరగాలని వారు ఆకాంక్షించారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

చొప్పదండి,ప్రభాతవార్త:



హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి జాతీయ క్రీడా దినోత్సవం శనివారం ఘనంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాగంపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పి డి రాజ కుమార్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సావిత్రి దేవి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

పేదల సొంతింటి కల సహకారం : పేద కుటుంబాల కళ్లల్లో ఆనందం

40 మంది లబ్ధిదారుల గృహ ప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, ప్రభతవార్త:

ఇండ్లు లేని నిరుపేదలకు గూడు కల్పించి ఆనందాన్ని చూడటం ద్వారా పొందిన అనుభూతి అనిర్వచనీయమని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన 40 డబుల్ బెడ్ రూమ్ గృహ ప్రవేశాల ప్రారంభోత్సవానికి ఆయన శనివారం అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ సొంత ఇళ్లలోకి అడుగుపెట్టడం, ఆ ఆనందోత్సవాల్లో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి వారి కలను సాకారం చేసిందని తెలిపారు. ఈ సంతోషాన్ని, ఈ ఆత్మగౌరవాన్ని పేద ప్రజలకు ఇవ్వాలనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోరుకుంటోందని ఆయన చెప్పారు. కేవలం ఇల్లు కాదు, ఒక భరోసా అని, ఇందిరమ్మ ఇళ్లు పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదల ఇళ్ల కలను కల్లలుగా మిగిల్చిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి నియోజక



వర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇల్లు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. డబుల్ ఇండ్లలో ఉన్న విద్యుత్ తో పాటు చిన్న చిన్న అవసరాలను సర్పంచ్ రాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, హౌసింగ్ డీఈ సాజిద్, ఎంపిడివో శశికళ, ప్యాక్స్ చైర్మన్ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలి

నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట, ప్రభాతవార్త:



ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారెంటీలు 620 హామీల అమలుపై వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై తలపెట్టిన నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పిలుపు నిచ్చారు. శనివారము గంభీరావుపేట మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో మాజీ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తో కలిసి మండలస్థాయి నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన లో రాష్ట్రంలోని ప్రజలు ఎంతో విసిగిపోయారన్నారు. ప్రభుత్వ పాలనపై రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో వచ్చేనెల రెండు నుండి ఏడు వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నిరసన కార్యక్రమంలో ప్రతి బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఇచ్చిన హామీలు గాలికి వదిలి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ అబద్దాలతో నెట్టుకొస్తున్నట్లు ఆరోపించారు. ఎరువుల కోసం ప్రవేశపెట్టిన కొత్త డిజిటల్ యాప్ రైతులకు మరింత తంటాలు తెచ్చిపెడుతుందన్నారు. బిఆర్ఎస్ పాలనలో రైతులకు సరిపడు ఎరువుల నిల్వలు, నిరంతర విద్యుత్తు, పెట్టుబడి సహాయం, రుణమాఫీ, కళ్యాణలక్ష్మి లాంటి ఎన్నో పథకాలు అమలు చేసిందన్నారు. అబద్దాలు, తిట్ల పురాణంతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్క పథకానికి మంగళం పాడుతున్నట్లు ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని సక్రమంగా వినియోగించి చెరువులను నింపడంలో ప్రభుత్వం విఫలమైందని మండి పడ్డారు. రైతుల పొలాలకు నీళ్లు ఇస్తే, ఎరువులు, బోనస్, ధాన్యం కొనుగోలు బాధ్యతలు పడతాయనే ఉద్దేశంతోనే ప్రభుత్వం నీటి విడుదలపై నిరక్ష్యం చూపుతోందని ఆరోపించారు. గతంలో ఇచ్చిన 100 రోజుల హామీలు 1000 రోజులైనా పూర్తి కాలేదని, దీనిపై ప్రజాక్షేత్రంలో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. వారం రోజులపాటు జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యతాయుతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు పాపగారి వెంకటస్వామి గౌడ్, గంద్యాడపు రాజు, ఉపసర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి, కొమిరిశెట్టి లక్ష్మణ్, వెంకట్ యాదవ్, కమ్మరి రాజారాం, రెడ్డిమల్ల రాజనర్సు, లింగం యాదవులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పీఎం కుసుమ్ పథకాన్ని రైతులు అందిపుచ్చుకోవాలి

ఎన్పీడీసీఎల్ ఎస్ఇ రవీందర్

దమ్మన్నపేటలో రెండు మెగావాట్ల పీఎం కుసుమ్ సోలార్

గంభీరావుపేట, ప్రభాతవార్త:

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పీఎం కుసుమ్ పథకం రైతులు అందిపుచ్చుకోవాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ పిలుపునిచ్చారు. శనివారము గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో 2 మెగావాట్ల పీఎంకుసుమ్ సోలార్ ప్లాంట్ టెస్ట్ రన్ చేసి విజయవంతంగా సాంకేతిక పరీక్షలు నిర్వహించి నాగంపేట సబ్ స్టేషన్ గ్రిడ్ కు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి పీఎంకుమ్ పథకం ఎంతో లాభదాయకమని అన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పుష్కలమైన అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో నిన్నటి వరకు అన్నదాతగా ఉన్న రైతన్న నేడు విద్యుత్ ప్రదాతగా మారి హరిత ఇంధన ఉత్పత్తిలో భాగస్వామ్యం కావడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 17 దరఖాస్తు దారుల్లో ఐదు పీఎం కుసుమ్ సోలార్ ప్రాజెక్టులు గ్రిడ్ కు అనుసంధానం జరిగినట్లు వెల్లడించారు. వీటి సామర్థం 10 మెగావాట్లు అని తెలిపారు. రెడ్కో జిల్లా మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 95 మంది రైతులు ఈ పథకం కింద నమోదు చేసుకొని 125.9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఎన్పీడీసీఎల్ సంస్థతో 25 ఏండ్ల కొరకు పీపీఏ అగ్రిమెంట్లు



చేసుకున్నట్లు వివరించారు. వారు ఉత్పత్తి చేసిన ప్రతీ యూనిట్ కు రూ. 3.13 చొప్పున డిస్కం చెల్లిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు 12 ప్లాంట్లు 17 మెగావాట్ల సామర్థంతో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాయని పేర్కొన్నారు. ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ కొరకు 3.5 ఎకరాల భూమి అవసరం అవుతుందని, ఆ ప్లాంట్ నుండి రోజుకు సుమారు 4500 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఏటా 16 లక్షల యూనిట్లకు పైగా జరిగే ఉత్పత్తి పై మొత్తం రూ. 56 లక్షల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఒక మెగా వాట్ ప్లాంటుకు రూ. 3.5 కోట్లు ఖర్చు అవుతుందని, బ్యాంకర్లు 85 శాతం పెట్టుబడి సమకూరుస్తున్నట్లు వెల్లడించారు. తమ పెట్టుబడి పదేళ్లలో వాపసు వస్తుందని తెలిపారు. అగ్రిమెంట్లు చేసుకున్న రైతులు త్వరితగతిన పనులు పూర్తి చేసి సెప్టెంబర్ నెలాఖరులోపు ఉత్పత్తి ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో డిస్కం డీఈలు అంజయ్య, చంద్రమోళి, ఏడీఈ లు శ్రీనివాస్, రవి, ఏఈలు ఆనంద్, ప్లాంట్ యజమాని జూనూతుల రాజారెడ్డి, శ్రేయాస్ ఇన్ఫ్రా కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే ఉచిత నోట్ బుక్స్ పంపిణీ

ఇల్లంతకుంట, ప్రభాతవార్త:

ఇల్లంతకుంట మండల కేంద్రంలోనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఉచిత నోటుబుక్కులు అందించారు. ప్రిన్సిపల్ దేవరాజం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఉపాధ్యాయుడై కళాశాల విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతోనే విద్యార్థుల భవిత ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుకు విద్యార్థులే పునాదిరాళ్లు అన్నారు ప్రభుత్వం పాఠశాలల కళాశాలల విద్యార్థులకు అన్ని



రకాల సదుపాయాలు కల్పిస్తుంది అన్నారు. దీనిని వినియోగించుకొని పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి తల్లిదండ్రుల ఉపాధ్యాయుల పేరును నిలబెట్టాలని కోరారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు నిర్మించ బోయే మరుగుదొడ్ల కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ రాచకట్ల సురేష్, సర్పంచ్ రాజు, ప్యాక్స్ చైర్మన్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వార్త



విద్యార్థులు జీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలి

కరస్పాండెంట్ శ్రీనివాస్

తంగళ్ళపల్లి, ప్రభాతవార్త:



తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని సరస్వతీ శుభోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నేషనల్ డే స్పోర్ట్స్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా నేషనల్ స్పోర్ట్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ క్రీడాకారుడుగా భారతదేశానికి ఎన్నో విజయాలను అందించారని అన్నారు. ఆటలతో శరీరం దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. విద్యార్థులు నిత్యజీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతుందని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని వల్లంపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగోత్రి మహిళా సంఘం భవనం, ఇల్లంతకుంట మండల కేంద్రములో అంగన్వాడీ భవన ప్రారంభోత్సవాల్లో శనివారం అతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన ప్రారంభోత్సవం జరుపుకోవడం ముదావహమని పేర్కొంటూ స్థలదాత కట్ట సౌమ్య శ్రీకాంత్‌రెడ్డి లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నేరెళ్ల విజయ్, మామిడి రాజు, డిపిఎం పద్మయ్య, ఏపీఎం కుమారస్వామి, ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ సురేష్, సిడిపివో ఉమారాణి, సూపర్ వైజర్ చంద్రకళ, మహిళా అధ్యక్షులు కట్ట సౌమ్య, పార్టీ నాయకులు, రాజశేఖర్, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, అనిల్, ఎలగందుల ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మండల బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

ముస్తాబాద్ ప్రభాత వార్త:



కేటీఆర్ ఆదేశాల మేరకు మండలములోని ఆయా గ్రామాల్లో నేటి నుంచి బిఆర్ఎస్ పార్టీ చేపట్టే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ముస్తాబాద్ మండల కేంద్రంలోని నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ సమావేశములో నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై, బిఆర్ఎస్ పార్టీ తలపెట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. వచ్చే నెల రెండవ తేది నుండి ఏడవ తేది వరకు నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమములో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తోట అగయ్య, మండల అధ్యక్షులు బొంపెల్లి సురేందర్ రావు, మాజీ జడ్పీ చైర్మన్ తులఉమ, మాజీ రైతు బంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, అక్కరాజు శ్రీనివాస్, కొండశీను, నర్సింగరావు, బదనకల్ సర్పంచ్ నరేష్, బత్తుల అంజయ్య, మాజీ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కొమ్ము బాలయ్య, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం

-ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం

కొడిమ్యాల, ప్రభాతవార్త:

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి. గోపాల్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. చదువుతోపాటు ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని సూచించారు. కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి బి. భాస్కర్ మాట్లాడుతూ గత ఏడాది కూడా తమ కళాశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ



కనబరిచారని తెలిపారు. క్రికెట్‌లో తక్షిల్ అండర్17 విభాగంలో జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారని చెప్పారు. అదే విధంగా ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి మహిళా క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర క్రీడ ల్లోనూ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొని విజయాలు సాధించారని భాస్కర్ పేర్కొ న్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు కళాశాల తరఫున నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చెలిమల జయపాల్‌రెడ్డి, నాంపల్లి, ప్రమోద్, జయశీల, సీహెచ్ నర్సయ్య, సుమన్, శ్యామ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

-ఆదర్శంగా నిలిచిన తిమ్మాపూర్ యువత

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఎంతోమంది బాధితుల ప్రాణాలను కాపాడవచ్చని ఐఎంఏ జగిత్యాల అధ్యక్షుడు డాక్టర్ హేమంత్ తెలిపారు. జగిత్యాల పట్టణంలోని ఐఎంఏ భవనంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో జగిత్యాల మండలం రూరల్ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువకులు దుమాల గంగారెడ్డి,నక్క జలంధర్,నక్క శేఖర్, మహాదేవ్ రెడ్డి స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి పలువురికి



ఆదర్శంగా నిలిచారు.ఆపదలో ఉన్నవారికి రక్తం అందించి ప్రాణాలు నిలబెట్టాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చిన యువకులను ఐఎంఏ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి,ప్రతినిధులు పన్నాల మహిపాల్ రెడ్డి,రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్త రిపోర్టర్ వెంకటేష్ తండ్రి మృతికి ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి పరామర్శ

బీర్ పూర్ ప్రభాత వార్త:

జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల కేంద్రంలో శోకసంద్రంలో ఉన్న పలువురి బాధిత కుటుంబాలను జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించి, ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బీర్పూర్ మండలం తుంగూరు గ్రామానికి చెందిన వార్త రిపోర్టర్ వెంకటేష్ తండ్రి మల్లయ్య అనారోగ్యం తో ఇటీవల మృతి చెందడంతో, వారి నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్, అమరులైన వెంకటేష్ తండ్రి చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.అనంతరం, కండ్లపల్లి మాజీ సర్పంచ్ రవి మామ శీలం లచ్చన్న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, వారి కుటుంబాన్ని కూడా ప్రత్యక్షంగా కలసి పరామర్శించారు. లచ్చన్న



ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, ఆ కుటుంబానికి తన సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ఉప సర్పంచ్ లింగన్న, నాయకులు రవి, సర్పంచ్‌లు మారుతి, తోట శ్రీనివాస్, బోడ సాగర్, రంగు లక్ష్మణ్ లతో పాటు నాయకులు బుచ్చన్న, మెరుగు రాజేశం, గంగన్న, జలపతి, నర్సయ్య , లక్ష్మణ్ తదితర ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యమే కీలకం

-వికసిత్ భారత్ గ్రామపంచాయతీ ప్రణాళికలపై శ్రీరాములపల్లి, తుర్కాశీనగర్‌లో గ్రామసభలు

కొడిమ్యాల, ప్రభాతవార్త:వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించే ప్రక్రియలో భాగంగా జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని శ్రీరాములపల్లి, తుర్కాశీనగర్ గ్రామపంచాయతీల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ గ్రామసభల్లో 202627 సంవత్సరానికి చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గుర్తింపుపై చర్చించారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులు, ఆస్తులు, అందుబాటులో ఉన్న వనరులు, ప్రజల అవసరాలు, అభివృద్ధి లోపాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు గ్రామస్థుల అభిప్రాయాలను సేకరించారు. వికసిత్ భారత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో భాగంగా ప్రధానంగా నీటి భద్రత, గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధి మౌలిక వసతులు, విపత్తు నిర్వహణ అంశాలపై గ్రామసభలో చర్చ జరిగింది. ఆయా రంగాల్లో గ్రామానికి ఉన్న అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత ఆధారంగా అభివృద్ధి పనులను ఎంపిక చేయాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారిని స్వరూప గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను రూపొందించే విధానం, పనుల గుర్తింపు, పనుల ఎంపికలో పాటించాల్సిన విధానాలు, గ్రామ అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించే అంశాలను గ్రామస్థులకు వివరించారు. ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకుని వారి భాగస్వామ్యంతో రూపొందించే ప్రణాళికల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు సమగ్ర అభివృద్ధికి బాటలు వేయవచ్చని తెలిపారు. గ్రామసభల్లో ప్రజలు తమ గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, నీటి సమస్యలు, జీవనోపాధి అవకాశాలు తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సూచనలు అవసరాలను పరిగణనలోకి తీసుకుని 2026-27 సంవత్సరానికి సంబంధించిన గ్రామపంచాయతీ ప్రణాళికలను రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జగిత్యాల వార్త



విద్యతోపాటు యువత క్రీడారంగల్లో రాణించాలి

-క్రీడలకు ఆకాశమే హద్దు



రాయికల్ ప్రభాతవార్త:

విద్యతో పాటు క్రీడా రంగాల్లో విద్యార్థులు, యువత రాణించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ అన్నారు.శనివారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాష దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులను,తెలుగు పండితులను సాలువ మెమెంటోతో ఘనంగా సన్మానించారు.అనంతరం రాయికల్ బాయ్స్ హై స్కూల్ లో బాస్కెట్ బాల్ స్టేట్ పూర్వ క్రీడాకారులు వాసం ప్రసాద్,దాసరి గంగాధర్,బండెల శ్రీనివాస్,తాటిపాముల శ్యామ్,కుర్మ సుదర్శన్ రెడ్డి, దేవేందర్ల సహకారంతో 15 వేల రూపాయలతో బాస్కెట్ బాల్ కోర్టు లో రింగ్స్,కలర్లు, బాస్కెట్ బాల్ ను అందించి కోర్టును ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత,విద్యార్థులకు చదువుతోపాటు వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు గ్రామీణ క్రీడలు ఎంతో దోహద పడతాయన్నారు.గ్రామీణ క్రీడాకారులను గుర్తించి క్రీడలపై అవగాహన కల్పించి ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించడం లో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.క్రీడాకారులను తయారు చేసి జిల్లా,రాష్ట్రస్థాయిలో రాణించేలా తీర్చిదిద్ది రాయికల్ మండలానికి పేరు తేవాలన్నారు.క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఒత్తిడి నుండి దూరం చేసి ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్,కోశాధికారి సుధవేణి మురళి,క్లబ్ సభ్యులు బత్తిని భూమయ్య,మ్యకల రమేష్, మచ్చశేఖర్,దాసరి గంగాధర్,కుర్మ సుదర్శన్ రెడ్డి,ఆడెపు రాంప్రసాద్,బాలే నిఖిల్, సాంబారు శ్రీనివాస్,పులి రమేష్,సామల్ల సత్యనారాయణ, వ్యాయామ,తెలుగు పండిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానంతో కొత్త వెలుగులు

-సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త:



నేత్ర దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రం లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో 41 వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా శనివారం నేత్ర దానంపై హరి అశోక్ కుమార్ అవగాహన కల్పించారు. నేత్ర దానం తో మరొకరి జీవితం లో వెలుగులు నింపినట్లవుతుందన్నారు అనంతరం నేత్ర దానం పై ప్రతిజ్ఞ చేయించారు. టాస్క రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథ ము, కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు,, పూసాల అశోక్ రావ్, బొల్లం విజయ్, ఎం. డీ. యాకుబ్,కరుణ, వివిధ యువజనా, మహిళా, సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మానకొండూరు నియోజకవర్గంలో అరాచక పాలన నడుస్తోంది

-ప్రశ్నిస్తే కేసులా..!

తిమ్మాపూర్,ఆగస్టు29, ఆగస్టు 29:



మానకొండూరు నియోజకవర్గంలో అరాచక పాలన నడుస్తున్నదని, ఎవరు ప్రశ్నించినా కేసులు పెడుతూ బెదిరిస్తున్నారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధ్వజమెత్తారు. హామీ ఇచ్చిన పనులను చేయాలని కోరితే దాడులకు ప్రోద్బలిస్తున్నారని అన్నారు. పలు సర్వేల్లో రాష్ట్రంలోనే మానకొండూర్ నియోజకవర్గం ఓడిపోయే మొదటి సీటు అని తేలడంతో... ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఏం చేస్తున్నారు ఆయనకు తోచడం లేదని ఎద్దేవా చేశారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో తాను నిధులు తెచ్చి రోడ్డును ప్రారంభిస్తే దాన్ని పూర్తి చేయడం కూడా చేతకాని ఎమ్మెల్యేగా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. ఐదు కోట్లు పెండింగ్ బిల్లు ఇప్పిస్తే రోడ్డు పూర్తవుతుందని అది కూడా చేతకావడం లేదని అన్నారు. నాడు తనపై యువజన సంఘాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందిన ఎమ్మెల్యే, నేడు అదే యువజన సంఘాలు చేస్తున్న శాంతియుత ర్యాలీని పోలీసుల ద్వారా అడ్డుకుంటున్నారని విమర్శించారు. యువజన సంఘాల ర్యాలీకి పోటీగా ఆయన ఓ ర్యాలీ అదే రోజు చేయడం ఏంటనే ప్రశ్నించారు. ఈ సమస్యలపై నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని స్పష్టం చేశారు. గతంలో తన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎవరు నిరసన తెలిపిన అభ్యంతరం తెలుపలేదని గుర్తు చేశారు. తనపై వస్తున్న విమర్శలకు కిందిస్థాయి క్యాడర్ సపోర్ట్ చేయడం లేదని, దీంతో ఆయన ఏం చేస్తున్నారు అర్థం కావడం లేదని అన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తే ఎవరిపైనైనా కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. యువజన సంఘాలు చేస్తున్న ర్యాలీని అడ్డుకోవడం హాస్యాస్పదమన్నారు. ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ సతీమణి డాక్టర్ అనురాధ కార్యకర్తలను రెచ్చగొట్టడం సరికాదని పద్ధతి మార్చుకోవాలని హితువు పలికారు. మీరు కాంగ్రెస్ పార్టీలో లేక ముందు నుంచి ఉన్న కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని వారికి ఏం చేశారని ప్రశ్నించారు. వారు ఎందుకు మీకు సపోర్ట్ చేయాలని అన్నారు. మానకొండూరు నియోజకవర్గం లో ఎంతమంది ఎమ్మెల్యేలని అన్నారు. నేరంలో నిందితుడిగా కండిషన్ బెల్ పై ఉన్న మురళీధర్ రెడ్డి బయట స్వేచ్ఛగా తిరుగుతున్నాడని, అందరిని ఎందుకులకు ఒకే రోలు ఎందుకు లేదని ప్రశ్నలు పోలీసులను ప్రశ్నించారు. నేరస్తులకు సపోర్ట్ చేయడం పట్ల సిపిని కలుస్తామని చెప్పారు. తమ కార్యకర్తలు ఒక మెసేజ్ పెడితేనే కేసులు నమోదు చేస్తున్న పోలీసులు.. నిందితులు అయిన వారు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే ఎందుకు పట్టించుకోవడంలేదని అన్నారు. కేసులు బెదిరింపులు తూటాలకు భయపడేది లేదని ఇలాంటి ఆటుపోట్లు ఎన్నో ఎదుర్కొనే వచ్చామని స్పష్టం చేశారు. మీ తూటాలు మాకు పెప్పర్మెంట్లతో సమానమని అన్నారు. రాజేందర్ రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని, మూడు రోజుల్లో వచ్చిన ఏం చేస్తానన్న ఎమ్మెల్యే ఇప్పటివరకు వెళ్లకపోవడం గనుక ఆంతర్యం ఏంటని అన్నారు. రాజకీయాలు చేసే డాక్టర్ అనురాధ ఒక మహిళ అయినా రాజేందర్ రెడ్డి భార్య కన్నీళ్లు తుడ్చలేదని ప్రశ్నించాలి. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని లేకపోతే తాము కూడా మీ పద్ధతిలోనే వస్తామని స్పష్టం చేశారు.

ఆత్మ సాంకేతిక సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ

చిగురుమామిడి, ప్రభాత వార్త :



చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదిక లోరైతులకు ఆత్మ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆత్మ పిడి చత్రు నాయక్ వరి పంటలో ఏడు సన్న రకాల వంగడాలు, వరి సాగులో అనుసరించాల్సిన శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, కాలానుగుణంగా వచ్చే పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించటం జరిగింది.అసిస్టెంట్ ప్రొఫెసర్ అగ్రికల్చర్ కాలేజీ శాస్త్రవేత్త హరికృష్ణ వరి పంటలో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు పాటించాల్సిన సాగు పద్ధతులు, సన్న రకాల ఎంపిక, ఎరువుల యాజమాన్యం పంట దశల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పంటలో పురుగులు, తెగుళ్లను ముందుగానే గుర్తించి, అవసరమైన సమయంలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చిగురుమామిడి గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని, మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్, అర్చన ఏఈఓలు చిగురుమామిడి మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం రైతుల సందేహాలను అధికారులు, శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా వరి పంటలో అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తి మెరుగైన ఆదాయం సాధించవచ్చని రైతులకు సూచించడం జరిగింది.

మిగతా శాఖ అధికారులు ఎక్కడ..?

-అధికారులను నిలదీసిన దళిత సంఘం నాయకులు ..

-తూతూ..మంత్రంగా పౌర హక్కుల దినోత్సవం

మానకొండూర్, ప్రభాతవార్త :



పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమానికి మిగతా శాఖల అధికారులు ఎందుకు హాజరు కాలేదని దళిత సంఘం నాయకులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. దీంతో రెవెన్యూ అధికారులు కార్యక్రమాన్ని తూ తూ మంత్రంగా నిర్వహించారు. శనివారం మానకొండూరు మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి గ్రామ సర్పంచ్ ఎడ్ల సత్యనారాయణ, ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్, కార్యదర్శి చావన్ లాల్, రెవెన్యూ అధికారులు అశోక్, స్వాతి, వార్డు సభ్యులు, దళిత సంఘం నాయకులు, పూలమాలవేసి నివాళులర్పించారు. పౌరహక్కుల దినోత్సవంలో రెవెన్యూ, ఐకెపి, గ్రామ సర్పంచ్, పాలకవర్గం మాత్రమే హాజరు కాగా, మిగతా 13 శాఖల అధికారులు ఎందుకు హాజరు కాలేదని గ్రామ దళిత సంఘ నాయకుడు రాపాక రాజేశ్వర్, యువజన సంఘం నాయకులు రెవెన్యూ అధికారులను నిలదీశారు. పౌర హక్కుల దినోత్సవానికి మిగతా శాఖల అధికారులు హాజరై దళితులకు అవగాహన కల్పించవలసిన అధికారులే సమావేశాలకు డుమ్మా కొట్టడం ఏంటని ప్రశ్నించారు. హాజరు కాని మిగతా శాఖల అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేయవలసిన బాధ్యతగల జిపిఓ నిరక్ష్యం పట్ల దళిత సంఘం నాయకులు ఆమె పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ.అశోక్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని కోరారు. దళితుల పట్ల చిన్నచూపు చూపవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

డాక్టర్ వి. నరేందర్ రెడ్డి

కరీంనగర్ ఎడ్యుకేషన్, ప్రభాతవార్త :ఆధునిక కాలంలో సైక్లింగ్ వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ హానరరీ చైర్మన్ డాక్టర్ ఊట్కూరి నరేందర్ రెడ్డి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "రన్ అండ్ రైడ్" కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని సూచించారు.కార్యక్రమాన్ని ప్రారంభించిన అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... యువత సైక్లింగ్‌ను దినచర్యలో భాగం చేసుకోవాలని, త్వరలోనే జిల్లా సైక్లింగ్ పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయికి క్రీడాకారులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ మిట్టపెల్లి మహేందర్, లయన్ నార్ల వేణుగోపాల్, లయన్ అరవింద్ బాబు, డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, సైక్లిస్ట్ అఖిల్, లేక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కరీంనగర్ వార్త



భగవతిలో జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవం

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:



కరీంనగర్ భగవతి హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం,తెలుగు భాషా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయనీ పాఠశాల చైర్మన్ బి.రమణారావు తెలిపారు. ఈ వేడుకల్లో విద్యార్థులు క్రీడల ప్రాముఖ్యత, తెలుగు భాష గొప్పతనంపై ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనానికి శారీరక వ్యాయామం, క్రీడలు తప్పనిసరి అని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి. విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ రామ్ మోహన్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

-మానకొండూర్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

-మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్..

మానకొండూర్, ప్రభాతవార్త :



కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బిఆర్ఎస్ నేతలకు సూచించారు. శనివారం మానకొండూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్ లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రసమయి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న నిరసన కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల అమలులో వైఫల్యం, ప్రజా సమస్యలు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలోని లోపాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేలా నియోజకవర్గవ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.సెప్టెంబర్ 1 నుండి 8 వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి గ్రామ నుండి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాలను విజయవంతం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి శేఖర్ గౌడ్, నియోజకవర్గ నాయకులు దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, మహిపాల్ రెడ్డి, మహిపాల్, గంప వెంకన్న, లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, శాతరాజు యాదగిరి, స్వామి రెడ్డి, లక్ష్మణ్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఆబాది జడ్పీహెచ్ఎస్ లో ఘనంగా ప్రతిభా పురస్కారాల ప్రధానం

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

స్థానిక ఆబాది జమ్మికుంట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2026 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు పూర్వ విద్యార్థుల బృందం నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలను అందజేసింది. 2015 నుంచి క్రమం తప్పకుండా పాఠశాల పూర్వ విద్యార్థులు పింగళి వెంకట రెడ్డి, మార్క విజయ్ ప్రకాష్, డాక్టర్ కాటిపల్లి లింగారెడ్డి, అయిత శ్రీనివాస్, అమృత సురేష్ లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన డొంకటి సాక్షి తకు రూ. 5000, దొడ్డే రణ వర్ధన్ కు రూ.3000, మైస అక్షిత్ కు రూ. 2000 చొప్పున నగదు బహుమతు లతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి అయిత శ్రీనివాస్ విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ ప్రేరణాత్మక ప్రసంగం



చేశారు. అనంతరం డాక్టర్ లింగారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తు ఉన్నత చదువులకు, వారి విద్యావసరాలకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సుజాత, పాఠశాల ఉపాధ్యాయులు రాజేంద్ర కుమార్, కృష్ణమూర్తి, సృజన, రాజశ్రీ, దుర్గాప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;



జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల లో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డా. కే. గణేష్ అధ్యక్షతన తెలుగు విభాగాధిపతి డా.మురాడి శ్యామల ఆధ్వర్వంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జీ ప్రిన్సిపాల్ గిడుగు వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొద్దిమంది వరకే పరిమితమైన చదువును అందరికీ అందుబాటులోనికి తెచ్చిన వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు ఆని అన్నారు. భాషలెన్ని నేర్చుకున్నా భావోద్వేగాలను వ్యక్తం చేయడానికి మధురమైన తెలుగు భాషకు సాటేది లేదని అన్నారు.తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ మురాడి శ్యామల మాట్లాడుతూ తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న మాధుర్యాన్ని తెలియజేసిన మహనీయులు గిడుగు అని అన్నారు. తెలుగు భాషా ప్రాధా న్యతను వివరిస్తూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు తెలుగు మాధ్యమం అందుబాటులో రావాలని, ప్రభుత్వం జారీచేసే ఉత్తర్వులు, సమాచారం తెలుగులో ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉమాకిరణ్, డా. కె. మాధవి, డా. పీ. స్వప్న , డా.రాజ కుమార్, డా. ఎంబాడి రవి, రవిందర్, డా.రవిప్రకాష్, డా.శ్రీనివాస్,రమేష్, సాయికుమార్,అరుణ్ కుమార్, అధ్యాపకేతర బృందం, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విస్డం కళాశాల ముందు విద్యార్థి సంఘాల ధర్నా

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

జమ్మికుంట పట్టణంలోని విస్డం కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు టీసీలు (ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్లు) ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యం పలుమార్లు తిప్పించుకుంటోందని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం కాలేజీ ముందు విద్యాశాఖ మంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీ తో ధర్నా నిర్వహించారు. విస్డం కళాశాల ఇతర ప్రాంతాలకు అమ్ముకున్న తర్వాత ద్వితీయ సంవత్సరం చదవాల్సిన విద్యార్థుల టీసీలను ఇవ్వాలని కోరుతున్నప్పటికీ, కాలేజీ యాజమాన్యం సరైన సమాధానం ఇవ్వకుండా విద్యార్థులను పదేపదే కాలేజీ చుట్టూ తిప్పించుకుంటుందని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించి, విద్యార్థులందరికీ ఎలాంటి జాప్యం లేకుండా టీసీలను అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశంలో కాలేజీ యాజమాన్యం నిరక్ష ్యంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు.వెంటనే పోలీసు



అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని కళాశాల యాజమాన్యంతో మాట్లాడినప్పటికీ రేపు ఉదయం 10 గంటల తర్వాత టిసి లు అప్పగిస్తామని కళాశాల యాజమాన్యం లెటర్ పాడ్ పైన రాసి హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు ధర్నా విరమించారు. రేపు సంబంధిత సర్టిఫికెట్లు ఇవ్వకపోతే విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్ష చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గట్టు సాయిరాం , జవ్వాజి అనిల్ , నలఘశ హరీష్ యాదవ్ , నరెంగుల శివ , సాయి , రాజు, కౌశిక్ , వినయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ I నుంచి అంగన్వాడీ టీచర్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త:



హుజురాబాద్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 16 అంగన్ వాడి టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సెప్టెంబర్ 1 నుండి 3వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని సిడిపిఓ సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు. సైదాపూర్ మండలంలోని గొడిశాల1, గొడిశాల2, సైదాపూర్1, సైదాపూర్2, హుజురాబాద్ మండలంలోని శాలపల్లి అంగన్వాడి టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సెప్టెంబర్ 1 న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. హుజురాబాద్మున్సిపల్ పరిధిలోని కుమ్మరి వాడ, సైదాపూర్ మండలం దుద్దెనపల్లి1, సర్వాయిపేట అంగన్ వాడి అభ్యర్థులకు 2న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. హుజురాబాద్ మండలం గొల్లపల్లి, ఇల్లందకుంట మండలం గడ్డివానిపల్లి, వీణవంక మండలం కొత్తపల్లి, జమ్మికుంట మండలం గోవిందాపూర్, నాగంపేట, మొల్లపల్లి, వడ్డెరవాడ అంగన్ వాడి కేంద్రాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వచ్చే నెల మూడో తేదీన సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు తమకు నిర్దేశించిన తేదీల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటలలోగా హుజురాబాద్ కేసి క్యాంపులో గల దమ్మక్కపేట రోడ్డులోని సిడిపిఓ కార్యాలయానికి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావలిసిందిగా తెలిపారు.

లబ్ధి దారులకు ప్రొసీడింగ్స్ అందజేసిన సర్పంచ్

వీణవంక, ప్రభాత వార్త:



వీణవంక మండలము కోర్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమములో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు ఐదుగురికి ప్రొసీడింగ్ కాగితాలను గ్రామ సర్పంచ్ పూద రి రమ్యకృష్ణ అనిల్ లు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు ఇండ్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ,త్వరగా గృహ నిర్మాణ పనులు చేపడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమములో ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,పంచాయితీ కార్యదర్శి తో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ వార్త



అంటరాని తనం, కుల వివక్షతను రూపుమాపాలి

ఎస్సై సంజీవ్,నాయబ్ తహసిల్దార్ శంకర్

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;



అంటరాని తనం, కులవివక్షతను రూపుమాపాలని ఎస్సై ఎస్ సంజీవ్ అన్నారు. జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ రాచపల్లి వనజ రాజయ్య అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై సంజీవ్, నాయబ్ తహసిల్దార్ శంకర్ లు అంబేద్కర్ సంఘం సభ్యులు, దళితులతో సమావేశమయ్యారు.ఎస్సీ,ఎస్టీ పై కుల వివక్ష,అంటరాని తనం, ఆలయాల్లో ప్రవేశ నిరాకరణ,హోటళ్లలో రెండు గ్లాస్ ల పద్ధతిని నిర్మూలించాలని తెలిపారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని,కుల వివక్ష,అంటరానితనం,రెండు గ్లాస్ ల పద్ధతి వంటి సామాజిక దురాచారాలకు సమాజములో ఎలాంటి స్థానం లేదని వివరించారు. గ్రామాల్లో సామాజిక సమానత్వాన్ని పెంపొందించేందుకు ప్రజలందరూ భాగ స్వాములు కావాలన్నారు. ఎస్సీ, ఎస్టీల పై ఎలాంటి కుల వివక్ష జరిగిన వెంటనే అధికారుల దృష్టికి తీసుక రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాచపల్లి వనజ రాజయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎన్ సత్యనారాయణ,జిపిఓ పి రాజు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చెల్పూర్ జెడ్పీహెచ్ఎస్ లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:



హుజురాబాద్ మండలంలోని చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఖిదేశభాషలందు తెలుగు లెస్సఖి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇ. అనురాధ మాట్లాడుతూ... గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని జరుపుకునే ఈ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. మాతృభాషతోనే నిజమైన భావ వ్యక్తీకరణ సాధ్యమవుతుందని, తెలుగులో విద్యాబోధన వల్ల మెదడు చురుగ్గా పనిచేయడమే కాకుండా విద్యార్థుల్లో గ్రహణ సామర్థం పెరుగుతుందని, తెలుగు భాష తల్లిపాలతో సమానమని ఆమె అన్నారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యం, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ట్రస్ట్ నిర్వాహకులు, సామాజిక కార్యకర్త డా. గంగిశెట్టి జగదీశ్వర్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎల్. సాహితీ, ఎన్. అక్షర, బి. శ్రీక్షణ్య, జి. అశ్వంత్ సాయి, డి. సిలోమి అనే ఐదుగురు విద్యార్థులకు హెచ్ఎం అనురాధ, డా. జగదీశ్వర్ చేతుల మీదుగా ఖిశంకర్ నారాయణ ఇంగ్లీష్తెలుగు డిక్షనరీఖిలను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మమత, గోదాదేవి, అంజనీదేవి, స్వర్ణలత, శ్రీదేవి, రాజేందర్, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

డెంగ్యూను తరిమికొడదాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

-12వ వార్డులో ప్రత్యేక వైద్య శిబిరం..

రక్త నమూనాల సేకరణ

సుల్తానాబాద్, ప్రభాతవార్త:

మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో డెంగ్యూ కేసు నమోదైన నేపథ్యంలో వైద్య, మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. డాక్టర్ నిస్సీ క్రిస్టినా ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ సింధుజ పాల్గొని డెంగ్యూ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ సోకిన వ్యక్తి నివాసంతో పాటు పరిసర గృహాల వద్ద పైరెత్రం స్ప్రే చేయించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ వస్తువులు, ఖాళీ పాత్రల్లో నీరు నిల్వ కాకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు.



దోమల వృద్ధికి అవకాశం లేకుండా పారిశుద్ధ్య చర్యలు పాటించాలని కోరారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిరక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. డెంగ్యూ నియంత్రణకు అధికారులతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, 12వ వార్డు కౌన్సిలర్ అమిరిశెట్టి శ్రావణి-రాకేష్, హెల్త్ అసిస్టెంట్ రాజేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ టి.రమేష్, మాజీ వార్డు మెంబర్ అమిరిశెట్టి తిరుపతి, ఏఎన్ఎం రమాదేవి, ఆశావర్కర్లు సుజాత, స్వరూప, కోమల, సుగుణతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

పెద్దపల్లి తహశీల్దార్ డి.రాజయ్య

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:



అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం అని పెద్దపల్లి తహశీల్దార్ డి.రాజయ్య తెలిపారు. పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఓటర్ లిస్ట్ రీ వెరిఫికేషన్ ప్రత్యేక ఎంక్వయిరీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో భాగంగా విడుదల చేసిన ఓటర్ జాబితాలో పేరు నమోదు కానీ వారి వివరాలను రీ వెరిఫికేషన్ చేస్తున్నామని చెప్పారు. ఓటర్ నమోదులో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా చూడాలని, ఎవరూ ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనర్హుల తొలగింపు, కొత్త ఓటర్ల చేర్పుపై అవగాహన కల్పించారు. ఓటర్ లిస్ట్‌లో పేరు లేని వారు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు తదితర పత్రాలతో వచ్చి తమ వివరాలను సరిచూసుకుని, తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియ ద్వారా గ్రామంలో వంద శాతం ఓటర్ నమోదు లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్ల కనకమ్మ పోలురాజు, ఉప సర్పంచ్ పర్స లక్ష్మి శంకర్, జీపీఓ కోటేష్, వార్డు సభ్యులు, బీ ఎల్ ఓలు, పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జూలపల్లి లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించిన తహసిల్దార్

జూలపల్లి,ప్రభాతవార్త:



జూలపల్లి మండల కేంద్రంలో శనివారం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టి నటువంట స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ పాఠకుల అనూష,తహసీల్దార్ దత్తు ప్రసాద్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ దత్తు ప్రసాద్ మాట్లాడుతూ. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ప్రజలకు రేషన్ సరుకులు సక్రమంగా అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత,జవాబుదారీతనం పెంచేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారుల వివరాలు డిజిటల్ విధానంలో నమోదు కావడంతో భవిష్యత్తులో ప్రభుత్వ సేవలను మరింత సులభంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.అర్హత ఉన్న ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ మల్లికార్జున్,పంచాయతీ కార్యదర్శి లచ్చయ్య,మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పాఠకుల అనిల్,వార్డు సభ్యులు ఎం డి.అంకూస్,జ్యోత్స్న, రేషన్ డీలర్లు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెలుగు భాషను అందరూ ఆదరించాలి

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:

తెలుగు భాషను అందరూ ఆదరించాలని గంగారం గ్రామ పంచాయితీ పరిధి ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య కోరారు. శనివారం ఆయన పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల పిల్లలకు పద్యాల పోటీలు, తెలుగు భాషలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పిల్లలకు తెలుగు భాషా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశభాషల్లోకెల్లా తెలుగు భాష అత్యంత గొప్పదని, కఠిన హృదయాలను సైతం కరిగించే శక్తి తెలుగు భాషకు ఉందన్నారు కార్యక్రమంలో ,ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, మంద శ్రీవాణి, విద్యార్థినీ, విద్యార్థులు, పలువురు పాల్గొన్నారు.



మాజీ ఎంపీపీని పరామర్శించిన మాజీ జెడ్పిటిసి

రామగిరి ప్రభాతవార్త ముత్తారం మాజీ ఎంపీపీ నాగినేని జగన్ మోహన్ రావు అనారోగ్యంతో బాధపడుతుండగా మాజీ జెడ్పిటిసి మైదం భారతి వరప్రసాద్ శనివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ లో చికిత్స పొంది కరీంనగర్ వచ్చిన సందర్భంగా వారు పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని ఓదార్చి ఆరోగ్యం కోలుకొని త్వరగా ప్రజాక్షేత్రంలోకి రావాలని వారు ఆక్షించారు.



పెద్దపల్లి వార్త

ఆపదలో ఉన్న కుటుంబానికి 'మేము సైతం'

-రూ.లక్షతో భరోసా..

ఎన్టీపీసీ,ప్రభాతవార్త:



ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విషాదంలో చిక్కుకున్న పినకాశి సతీష్ కుటుంబానికి శ్రీ భగవతీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించారు.ఈ ప్రమాదంలో సతీష్ భార్య కాలు కోల్పోగా, వారి చిన్న కుమారుడు ఒక చేతిని కోల్పోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబం తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న శ్రీ భగవతీ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు వెంటనే స్పందించి ఇప్పటికే రూ.30 వేల ఆర్థిక సహాయం అందించారు.కాగా, బాధిత కుటుంబం పరిస్థితిని తెలుసుకున్న ట్రస్ట్ జనరల్ సెక్రటరీ పైడా సాయి కుమార్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి తన ఆఫీస్ టీమ్ సభ్యులతో కలిసి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే జూల విజయ్ రూ.20 వేల ఆర్థిక సహాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు.ఈ విధంగా శ్రీ భగవతీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మొత్తం రూ.1,00,000 (లక్ష రూపాయలు) ఆర్థిక సహాయం బాధిత కుటుంబానికి అందించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వాన్ని చాటిన దాతలను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో కంకటి రవి గౌడ్, పైడా సాయి కుమార్, ఈశ్వర్ చందన, ఎనగంటి తేజ, సురారపు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అబ్బాపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

జూలపల్లి,ప్రభాతవార్త:



జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామంలో శనివారం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ దండే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ప్రజలకు రేషన్ సరుకులు సక్రమంగా అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత,జవాబుదారీతనం పెంచేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారుల వివరాలు డిజిటల్ విధానంలో నమోదు కావడంతో భవిష్యత్తులో ప్రభుత్వ సేవలను మరింత సులభంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.అర్హత ఉన్న ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అబ్బాపూర్ గ్రామంలో కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి,అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండే వెంకటేశ్వర్లు,వార్డు సభ్యులు గాండ్ల స్వప్నరాజు,మారం లావణ్య నాగరాజు,చిప్ప అరుణ్ కుమార్,నాయకులు అమురాజి రాజకుమార్,గన్ను రాజిరెడ్డి,గన్ను గంగారెడ్డి,వెంగళ నారయణ,సిపెల్లీ అంజయ్య,పంచాయతీ కార్యదర్శి మహ్మద్ మెహిన్,పద్మ,నాయకులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందిన క్రీడాకారులను సన్మానించిన లయన్స్ క్లబ్

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి లయన్స్ క్లబ్ అధ్యక్షులు వల్లాల జగన్ అధ్వర్యంలో శనివారం రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో ప్రథమ స్థానం పొంది మధ్యప్రదేశ్లోని ఇండోర్లో జరిగేటువంటి జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులను చొప్పదండి లయన్స్ క్లబ్ వారు శనివారం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా సత్కారం చేశారు. డిస్ట్రిక్ట్ క్యాబినేట్ సెక్రటరీ, కోశాధికారి కొల్లూరి ఆనందం, వల్లాల క్రిష్ణహరి మాట్లాడుతు తైక్వాండో పోటీలో రాష్ట్రస్థాయిలో ఎంపికైనా బుసారపు వెంకటేష్, మల్లేష్ విద్యార్థులను అభినందినీయమని మునుముందు ప్రపంచస్థాయి పోటీలో ఎంపిక కావాలని ఆకాంక్షించారు.అధ్యక్షులు వల్లాల జగన్ సెక్రటరీ దూస రాము, కోశాధికారి సిరిపురం రాజు మాట్లాడుతువిధ్యార్థులను తైక్వాండో పోటీలకు జాతీయ స్థాయిలో ఎంపికైనందుకు కోచ్ శ్రీగాధ సంతోష్ ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మైక్రో మెంబర్స్ పెద్ది లక్ష్మికాంతం, తొడుపునూరి లక్ష్మయ్య,చింతల రవి,తొడుపునూరి సత్యనారాయణ,నలుమాచు సుధాకర్ కోడూరి క్రిష్ణమూర్తి, కోచ్ శ్రీగాధ సంతోష్, విద్యార్థులు ప్రహర్ష ,స్పందన సౌమ్య , శ్రీ వాత్సవ్ , శివశంకర్ , రామ్ చరణ్ , జిల్లా కోచ్ లు నాగమణి , అంజలి , రమ్య పాల్గొన్నారు.

రజితకు అండగా ఉంటాము
ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర,ప్రభాతవార్త:



గంగాధర మండలం వెంకటయ్యపల్లి గ్రామానికి చెందిన ఇడగొట్టి వెంకటి హారిక దంపతులు గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి మూడవ కుమార్తె ఇడగొట్టి రజిత పుట్టుకతోనే దివ్యాంగురాలు కావడంతో తల్లిదండ్రులు కష్టపడి చిన్నారిని పెంచుతున్నారు. దివ్యాంగురాలు రజిత పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం వెంకటాయపల్లిలోని ఆమె ఇంటికి స్వయంగా వెళ్లి రజిత పరిస్థితిని గమనించి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. ఎంపీడీవో తో మాట్లాడి రజితకు వికలాంగుల పెన్షన్ వచ్చేలా చూడాలని ఆదేశించారు.పెన్షన్ మంజూరు కి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కు రజిత కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ గంకిడి సంధ్య రామచంద్ర రెడ్డి, ఉప సర్పంచ్ ఆసిఫ్, మోహన్ రెడ్డి,గుర్రం నరస గౌడ్, సురేష్, జయంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధ్యాన్ చంద్ అకుంఠిత దీక్షను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఇంచార్జ్ రాజమోళి

చొప్పదండి,ప్రభాతవార్త:



జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకొని శనివారం హాకీ క్రీడా మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ 121వ జయంతి అదేవిధంగా 15వ జాతీయ క్రీడ దినోత్సవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్నకొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు కానిగంటి రాజమోళి విద్యార్థులనుదేశించి మాట్లాడుతూ ధ్యాన్చంద్ యొక్క ప్రతిభ వల్ల ఒలంపిక్స్ క్రీడల్లో భారతదేశానికి స్వర్ణ పథకాలు రాబట్టడం, అదేవిధంగా 400 పైగా గోల్స్ చేసి ప్రపంచాన్ని న నివ్వరపరిచిన ధ్యాన్చంద్ అంకుటిత దీక్ష స్ఫూర్తిగా ఆయన చిత్రపటానికి పాఠశాల ఉపాధ్యాయులు గంగాధర్, శ్రీకాంత్, ఉమాదేవి, చంద్రశేఖర్, మీనాక్షి ,కిషన్ లు పూల మాలతో ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల క్రీడా ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్చంద్ గురించి,అతను దేశానీ కి చేసిన సేవలు, దేశభక్తి గురించి విద్యార్థులకు తెలుపుతూ అతనినీ జర్మనీ నియంత హిట్లర్ తన దేశానికి ఆహ్వానించినప్పుడు, సున్నితంగా తన ఆహ్వానాన్ని తిరస్కరించి భారతదేశంలోనే ఉంటానని భారతదేశం కోసం మాత్రమే ఆడతానని తెలిపిన ధైర్యవంతుడు, జాతీయ అభిమాని. జాతీయ అభిమానం వల్ల దేశం కోసం మాత్రమే ఆడతానని ఎలాంటి లాభా పేక్ష లేకుండా ఉన్న అతని చూసి నియంత హిట్లర్ సెల్యూట్ చేయడం మన జాతికి గొప్పతనం.అలాంటి వ్యక్తి అడుగుజాడలలో విద్యార్థులు ఉండాలన్నారు. క్రీడలు వల్ల దేశం యొక్క ప్రతిష్ట ప్రపంచంలో పెరుగునని, క్రీడలు వల్ల విద్యార్థులకు దేహ దారుఢ్యం పెంపొందించి,మానసిక వికాసాన్ని కలిగిస్తాయని, గెలుపోటములు సమాన దృష్టితో తీసుకోవాలని కోరారు.

వేములవాడ కోర్టులో ఘనంగా రాఖీ వేడుకలు

వేములవాడ, ప్రభాతవార్త:



వేములవాడ కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను శనివారం ఘనంగా చేపట్టారు. న్యాయవాదుల మధ్య సోదర భావం, ఆత్మీయత, పరస్పర గౌరవాన్ని చాటేలా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా న్యాయవాదులు తమ తోటి న్యాయవాదులకు రాఖీలు కట్టి, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాదులంతా పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సోదర భావం, ఆత్మీయత, పరస్పర గౌరవానికి ప్రతీకని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి తమిరి అన్నపూర్ణ, లైబ్రరీ సెక్రటరీ మొగిలి సుజాత, బూర సరిత, పావని, సబ్ కోర్టు ఏపిపి అవధూత రజనీకాంత్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గొంటి శంకర్, మాజీ అధ్యక్షులు గుడిసె సదానందం, మాజీ జనరల్ సెక్రటరీ గడ్డం సత్యనారాయణ రెడ్డి, జాయింట్ సెక్రటరీ కనికరపు శ్రీనివాస్, పొత్తూరు అనిల్ కుమార్తోపాటు పలువురు న్యాయవాదులున్నారు.

కాంగ్రెస్ నాయకున్ని పరామర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి మండల పరిధిలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన కోలపురి శ్రీకాంత్ తండ్రి రామయ్య మృతి చెందగా శనివారం రామయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ ను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,సర్పంచ్ లింగాల ఆనంద్, మార్కెట్ మాజీ వైస్చైర్మన్ మునిగాల రాజేందర్, మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరు సరిత శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్లు కొట్టే అశోక్, క రాజశేఖర్, గుర్రం రాజేందర్ రెడ్డి, గుర్రం సుజిత్ రెడ్డి, పిట్టల వెంకటేష్, ముద్దం తిరుపతి తో పాటు పలువురు పాల్గొన్నారు.

చొప్పదండి వార్త

విజిబి రామ్ జి తోగ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

మల్యాల, ప్రభాతవార్త:



ప్రతి గ్రామీణ కుటుంబానికి సంపత్సరంలో 125 రోజుల ఉపాధి హామీ కి చట్టబద్ధమైన హామీ కల్పించడమే కాకుండా, వికసిత్ గ్రామపంచాయతీ గా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించడం కోసం మొట్టమొదటిసారిగా శనివారం మల్యాల మండలంలోని ముత్యంపేట, ఓబులాపూర్ లో గ్రామ సభలు నిర్వహించారు.ఈ సందర్భంగా నీటి భద్రత,గ్రామీణ,మౌలిక వనరులు, జీవనోపాధి, మౌలిక వసతులు, విపత్తు నిర్వహణ కేటాగిరీలలో మొత్తం 318 అనుమతించిన పనుల జాబితా వివరాలను అధికారులు వెల్లడించారు,కార్యక్రమంలో సర్పంచ్లు ఆదిరెడ్డి, గ్యాధం కుమార్ మండల ఉపాధిహామీ ఎపిఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 26 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

– ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, ప్రభాతవార్త:



సెప్టెంబర్ 26 నుంచి 29 వరకు వేములవాడలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని త్రినేత్ర పంక్షన్ హాల్లో ఆయన అధికారులతో, నిర్వహక కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాలతోపాటు హైదరాబాద్కు చెందిన మరో జట్టు ఈ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. బాలుర విభాగంలో 34 జట్లు, బాలికల విభాగంలో 34 జట్లు కలిపి మొత్తం 68 జట్లు పోటీల్లో పాల్గొంటాయని, సుమారు 1,358 మంది క్రీడాకారులు వేములవాడకు రానున్నారని పేర్కొన్నారు. ఇటీవల వేములవాడలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను విజయవంతంగా నిర్వహించచామని, అదే స్ఫూర్తితో కబడ్డీ పోటీలను కూడా పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి యువత ఎక్కువ సమయం క్రీడా మైదానాల్లో గడపాలని కోరుకుంటున్నారని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్రంలోని యువ క్రీడాకారులు భవిష్యత్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మంత్రులు శ్రీహరి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్బాబు తదితరులు హాజరయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, కబడ్డీ అసోసియేషన్ నాయకులు కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

సర్ లో నోటీసులు అందుకున్న వారు హాజరు కావాలి

చొప్పదండి,ప్రభాతవార్త:

సమగ్ర ఓటర్ సర్వే లో భాగంగా నోటీసులు అందుకున్న వారు సరైన పత్రాలతో సెప్టెంబర్ 15 తేదీలోపు చొప్పదండి తహసిల్దార్ కార్యాలయంలో హాజరుకావాలని చొప్పదండి తహసిల్దార్ నవీన్ కుమార్ కోరారు. నోటీసులో తెలుపబడిన ఆధారాలను జతచేసి గడుగులోగా హాజరు కావలసిందిగా తెలిపారు. ముట్టిన నోటీసుపై ఎలాంటి ఆధారాలు సమర్పించని యెడల ఓటు హక్కును కోల్పోవాల్సి వస్తుందని తాసిల్దార్ పేర్కొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టకపోవటంతో పెరుగుతున్న డెంగ్యూ కేసులు

- అప్రమత్త లేకుంటే పొంచి ఉన్న ప్రమాదం
- ఇప్పటికే కనగర్తిలో డెంగ్యూ కేసు నమోదు
- గ్రామాల్లో ఎక్కడికక్కడ నిలిచిన పారిశుధ్య పనులు
- మోరాయిస్తున్న ఫాగింగ్ మిషిన్లు
- జాడేలేని డ్రై డే కార్యక్రమం
- వ్యాధి మరణాలు లేకుండా చర్యలు తీసుకోవాలి

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

వర్షాకాలం సీజనల్ వ్యాదులకు కేంద్రంగా తయారు అయ్యాయి. ప్రతి యేటా పలు వ్యాధుల బారిన పడి అస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.



అందులోనూ అడపాదడప వర్షాలు పడుతున్న సమయం. గ్రామాలు, పట్టణాలలో ఎక్కడిక్కడ నీటి నిల్వలు, మురికి కాలువలో పేరుకపోయిన మట్టివల్ల నీరు కలుషితం అవుతున్నాయి. ఈ కలుషిత నీటిలో దోమలు గుడ్లు పెట్టడం వాటి సంతతిని పెంచడంతో జిల్లాలో దోమల సంతతి రోజురోజుకూ పెంచుకుంటూ పోతున్నాయి. దోమకాటు వ్యాధులలో మలేరియా, చికెన్ గున్యా లతో పాటు ప్రాణాంతక వ్యాధి అయిన డెంగ్యూ పై అప్రమత్తంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారులు సూచిస్తున్నారు.ఇటీవల కోనరావు



పేట మండలంలోని కనగర్తి ఓ బాలికకు డెంగ్యూ బారిన పడింది.డెంగ్యూ కేసు నమోదు కావడంతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమమైంది.కానీ ప్రజల్లో మరింత పరిసరాల పరిశుభ్రత,వ్యక్తి గత పరిశుభ్రత పాటించినప్పుడే ఇలాంటి వ్యాధులకు దూరంగా ఉంటాం. గ్రామాల్లో ప్రతి మంగళ, శుక్ర వారాల్లో నిర్వహించే డ్రై డే కార్యక్రమం కాస్త ఆటకేక్కింది. దీంతో ఎక్కడికక్కడ నీటి నిల్వలతో దోమల విజృంభణ ఎక్కువవుతూనే ఉంది. ఉన్నతాధికారులు గ్రామాల్లో పాలకులను, అధికారులకు అప్రమత్తం చేసి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టకుండా ఆశ్రద్ధ వహిస్తే, డెంగ్యూ కేసుల నమోదు పెరిగే అవకాశం ఉందని ప్రజలు భయందోళనకు గురవుతున్నారు.

ఇళ్ల మధ్య నీరు నిల్వ ఉండడంతో పాటు జనావాసాల మధ్య మురికి నీరు, వరద నీరు నిల్వ ఉండటం, ఇంటిపై ఉన్న ట్యాంకులకు మూతలు లేకపోవడం, పూలకుండీల్లో వర్షపునీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండడం, ఇంటిపై ఉన్న పాతఖాళీ డబ్బాలు, టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు దోమలకు నిలయంగా మారుతు



న్నాయి. ప్రతీ ఏడాది జిల్లాలోని అన్ని మండలా ల్లో డెంగ్యూ కేసులు నమోదవుతున్నా యి. నీటి నిల్వలు లేకుండా చూడడంలో గ్రామ పంచాయతీల సిబ్బంది దృష్టి సారించకపోవడంతో దోమలకు ఆవాసాలు ఏర్పడి వాటి సంతతి పెంచుకుంటూ పోతున్నాయి. వర్షకాలం నీటి కుంటల్లో దోమలు గుడ్లు పెట్టడం వల్ల వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.నీరు నిలిచినట్లయితే బ్లీచింగ్ పౌడర్ లాంటి వాటిని చల్లాలి. కొద్దిరోజులుగా నీటిపై నిల్వఉన్న దోమలు మృతి చెందుతాయి. ఎక్కువ గా వ్యాధి సెప్టెంబరు, అక్టోబరు మాసాలలో కనిపించే అవకాశాలు ఎక్కువగా ఉంటుంది. ప్రజలు డెంగ్యూ భారీన పడకుండా అప్రమత్తంగా ఉండాల్సి న అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తత తో గ్రామాల్లో రెండు రోజులు డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బ్యాందిగా నిర్వహించి నీటి నిల్వలు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లే విధంగా చర్యలు తీసుకోవడం తో పాటు వారం రోజులకు ఒకసారి తప్పనిసరిగా వీధుల్లో ఫాగింగ్ చేయాల్సి న ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఫీజుల బకాయి బీజేపీ లడాయి

కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు తిరుపతి

చందుర్తి : ప్రభాతవార్త

రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఫీజుల బకాయి బీజేపీ లడాయి కార్యక్రమం లో బీజేవైఎం (యువమోర్చా) ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసన కార్య క్రమంలో బీజేవైఎం నాయకులు చందుర్తి మాజీ ఉపసర్పంచ్ చిర్రం తిరుపతి పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెం. 9 పేరుతో ప్రభుత్వం 10,000 కోట్ల బకాయిలు ఎగ్గొట్టింది. నెలకు 250 కోట్లు ఇస్తామనడం పేద విద్యార్థులను మోసం చేయడమే అన్నారు..ఈ లెక్కన 40 నెలలు పడుతుందని అప్పటివరకు రాజన్న సిరిసిల్ల బిడ్డల చదువు ఆగిపోవాలా అని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో యోగి ప్రతి



నెల 15న పక్కాగా ఫీజు వేస్తున్నారు.తెలంగాణలో కూడా డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే న్యాయం జరుగుతుందన్నారు.కేంద్రంలో మోదీ పీఎం యశస్వి ద్వారా వేల కోట్లు ఇస్తున్నారన్నారు.రాష్ట్రమే తన వాటా ఇవ్వడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, యువమోర్చా నాయకులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

– మల్లారంలో పాత బోర్వెల్ పునరుద్ధరణ పనులు ప్రారంభం

– సర్పంచ్ సంగం అర్పిత వీరారెడ్డి

వేములవాడ రూరల్, ప్రభాతవార్త:

వేములవాడ మండలం మల్లారం గ్రామంలోని రాజనగర్‌లో పాడుబడిన పాత బోర్వెల్‌కు హ్యాండ్ పంప్ ఫిట్ చేయించి, తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చే పనులను గ్రామ సర్పంచ్ సంగం అర్పిత వీరారెడ్డి శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి వార్డులో తాగునీటి సమస్య లేకుండా చూసేందుకే ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. నిరుపయోగంగా ఉన్న పాత నీటి వనరులను పునరుద్ధరించడం ద్వారా మంచినీటి కొరతను అధిగమించవచ్చని పేర్కొన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలోని ఇతర వార్డులలో కూడా ఇలాంటి పాడుబడిన నీటి వనరుల సర్వే చేపట్టి, వాటిని త్వరలోనే పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.గ్రామాభివృద్ధికి ప్రజా సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా



వాడుకోవాలని సూచించారు. ఊరిలోని మౌలిక వసతుల కల్పనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. అలాగే గ్రామంలో పారిశుధ్య లోపం తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలపగా, ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్ , వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మర్ల పేటలో ప్రమాదకరంగా మూల మలుపులు

మూల మలుపుల వద్ద ప్రత్యేక సూచికలు ఏర్పాటు చేయాలి

అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

బోయిన్‌పల్లి, ప్రభాతవార్త:

బోయిన్ పల్లి మండలం లోని మర్లపేట గ్రామం నుండి విలాసాగర్ వెళ్ళు రహదారిలో మూల మలుపులు ప్రమాదకరంగా మారి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రం నుండి వివిధ గ్రామాలకు వెళ్ళు ప్రజలు ఈ మూల మలుపుల వల్ల తరచూ పలు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రమాదాల నివారణకు



మూలమలుపుల వద్ద ప్రత్యేకమైన సైన్ బోర్డులు సంబంధిత అధికారులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వేములవాడ వార్త

యాప్ తో రైతులకు ఇబ్బందులు

రైతు సంఘం నాయకులు పెండ్యాల రామ్‌రెడ్డి

బోయిన్‌పల్లి, ప్రభాతవార్త:



బోయిన్‌పల్లి మండలంలోని చదువుకొని రైతులకు యాప్ లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చాలామంది రైతులకు ఎటువంటి స్మార్ట్ ఫోన్లు లేకపోవడం వల్ల బాగా ఇబ్బంది పడుతున్నామని రైతు సంఘం నాయకులు పెండ్యాల రాంరెడ్డి తెలిపారు. తక్షణమే రైతు యాప్ ను రద్దుచేసి పాత పద్ధతిలో యూరియా డిఏపి బస్తాలను ఇవ్వాలని కోరారు.

ఘనంగా తెలుగుభాష దినోత్సవం

రుద్రంగి ప్రభాత వార్త :



రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, కేరళ గ్లోబల్ స్కూల్ లో శనివారం గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలుగుభాష దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగుభాష యొక్క గొప్పతనాన్ని వివరించి 7 నుండి 9వ తరగతి విద్యార్థులకు ఆంగ్లపదం ఉపయోగించకుండా రెండు నిమిషాలు తెలుగు భాషలో మాట్లాడే విధంగాఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌ప్రిన్సి పాల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శ్రావణ మాస సందడి

రుద్రంగి ప్రభాత వార్త :



శ్రావణ మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రహ్లాద గుట్టపై వెలిసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతోకిటకిటలాడింది. ఆలయాన్ని మామిడి, అరటి ఆకులతో, ప్రత్యేక అలంకరణములతో అత్యంత సుందరంగా అలంకరించారు.ఆలయ పూజార్లు స్వామి వారికిఉదయం 6గంటలకు వేద మంత్రాలతో,పంచామృత అభిషేకము జరిపి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ప్రజలే కాకుండా వివిధ గ్రామాల నుండి పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని,ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో స్వామి వారికి భక్తులు బియ్యంసమర్పించడం ఆనవాయితీగా వస్తుంది.శ్రావణ మాసం సందర్భంగా పెద్దఎత్తున భక్తులు స్వామివారికి ఓడిబియ్యం సమర్పించుకున్నారు. భక్తులకు ఆలకమిటీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించామని ఆలయ కమిటీ చైర్మన్ సామ మోహన్ రెడ్డితెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీసభ్యులు, ఆలయ పూజార్లతో పాటు భక్తులు పాల్గొన్నారు.

రైతులు డిజిటల్ క్రాప్ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

వ్యవసాయ విస్తరణ అధికారి బి. శశిధర్
లక్కారంలో ఘనంగా రైతు అవగాహన సదస్సు



ముత్తారం, ప్రభాతవార్త: రైతులు డిజిటల్ క్రాప్ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి బి. శశిధర్ సూచించారు. ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు డిజిటల్ క్రాప్ సర్వే, పీఎం కిసాన్ ఫేషియల్ ఈ కేవైసీ, సన్న వరి సాగు వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి బి. శశిధర్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంట, పంట రకం, నీటిపారుదల సౌకర్యం తదితర వివరాలను సర్వే నంబర్ వారీగా డిజిటల్ క్రాప్ సర్వేలో సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట రకాలను సక్రమంగా నమోదు చేసుకోవడం వల్ల పంట విక్రయ సమయంలో ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే పీఎం కిసాన్ పథకం కింద రూ.2,000 పొందుతున్న రైతులకు ఫేషియల్ ఈకేవైసీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆధార్ వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డీలర్ వద్ద కాకుండా సొంతంగా సన్న వరి సాగు చేసిన రైతుల వివరాలు, సంబంధిత దరఖాస్తుల నమోదుపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పత్తి, మొక్కజొన్న తదితర పంటల సాగు వివరాలను కూడా డిజిటల్ క్రాప్ సర్వేలో సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్కారం గ్రామ సర్పంచ్ అత్తే చంద్రమౌళి, గ్రామ వాలంటీర్ గనవేన కుమార్, రాజయ్య, సతీష్, నారాయణ, సారయ్య, నరసయ్య, మోహన్ రెడ్డి, శంకర్, లింగయ్య, మొండయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఏజీఎం పల్లెర్ల సేవలు గణనీయం

పదవీ విరమణ కార్యక్రమంలో ఆర్ జి3 జీఎం మధుసూదన్
రామగిరి ప్రభాతవార్త:



విధి నిర్వహణలో ఏజీఎం సివిల్ పల్లెర్ల నాగేశ్వరరావు సేవలు గణనీయ మని ఆర్ జి త్రీ జి ఎం. సుంకర మధుసూదన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ అన్నారు. శనివారం రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సిఎన్‌సిఓ క్లబ్‌లో రామగుండం రీజియన్ సివిల్ క్వాలిటీ కంట్రోల్ సెల్ అడిషనల్ జనరల్ మేనేజర్ పల్లెర్ల నాగేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ జి 3 జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ పాల్గొని పల్లెర్ల నాగేశ్వరరావును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ విధి నిర్వహణలో పల్లెర్ల నాగేశ్వరరావు చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, సంస్థకు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఉద్యోగ జీవితంలో ఆయన అందించిన సేవలు చిరస్మర ణీయమని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం ఆయు రారోగ్యాలతో,ప్రశాంతంగా, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షిం చారు.ఈ కార్యక్రమంలో సివిల్ డీజిఎం రాజేంద్రకుమార్ లద్నాపూర్ సర్పంచ్ వనం రామచంద్రరావు మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య ఐ ఎన్ టి యు సి నాయకులు బెల్లం శ్రీనివాస్, సివిల్ కాంట్రాక్టర్స్, సింగరేణి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అప్పు కట్టమని అడిగినందుకు తప్పుడు ఆరోపణలు

మదర్ థెరిసా మహిళ పాడుపు సంఘ సభ్యులు
మంథని ప్రభాతవార్త :



మథర్ థెరిస్సా మహిళా పొదుపు సహకార సంఘంలో ప్రతి పైసాకు లెక్క ఉంది, ప్రతి వ్యవహారానికి ప్రతి రికార్డ్ ఉందని, తీసుకున్న అప్పు కట్టమని అడిగినందుకే ఆరోపణలు చేస్తున్నారని సంఘం సభ్యురాలు పేర్కొన్నారు. శనివారం మథర్ థెరిస్సా మహిళా పొదుపు సహకార సంఘం సభ్యులు మంథని ప్రెస్ క్లబ్ లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ... పొదుపు సహకార సంఘం మహిళల అభివృద్ధి కోరుకునే సంఘమని, ఈ సంఘంలో ప్రతి పైసాకు లెక్క ఉందని వారి వివరించారు. ప్రతి వ్యవహారానికి తూచా తప్పకుండా రికార్డులను నమోదు చేయడమే కాకుండా సంబంధిత రికార్డులకు ఆడిట్ కూడా నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. సంఘంలో సభ్యుల వివరాలు, సంఘం వాటా, మూలధనం, జీతభత్యాల గురించి, ప్రతి వ్యవహారానికి సంబంధించిన రికార్డు ఉందని వారు వివరించారు. వాళ్ళ అమ్మ తీసుకున్న అప్పు కట్టమని అడిగినందుకే నామని హరీష్ ఆరోపణలు చేస్తున్నాడని వారు విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో మదర్ తెరిస్సా మహిళా పొదుపు సహకార సంఘం మేనేజర్ మేకల మల్లేశం, సంఘం అధ్యక్షురాలు మాదేసి పద్మ, డైరెక్టర్ నామని సుగుణ, సభ్యులు ఎలగందుల సరిత, తాత యాదమ్మ, ముప్పిడి మల్లీశ్వరి, మోసం లక్ష్మి, మైదం శారద, పుల్లి లక్ష్మి, పుల్లి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ చౌక్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా అశోక్ ప్రధాన కార్యదర్శిగా మధు



మంథని ప్రభాతవార్త : మంథని మున్సిపల్ పరిధిలోని గాంధీచౌ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా ఓల్లాల అశోక్, ప్రధాన కార్యదర్శి కొమురోజు మధుకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం రాత్రి జరిగిన ప్రత్యేక సమావేశంలో వీరిని 2026, 27 సంవత్సరానికి గణపతి నిర్వహణతో పాటు బతుకమ్మ సంబరాలను, కోజాగరి వేడుకలను నిర్వహించడానికి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు గణేష్ ఉత్సవాలను నిర్వహించడానికి మరో ఇద్దరి సభ్యులను ఎన్నుకున్నారు వీరిలో ఓల్లాల వెంకన్న, కొమురోజు సుమన్ ఉన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీని వాస్, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు కొము రోజు మారుతి, కొమురోజు చంద్రమోహన్, కొమురోజు శ్రీని వాస్, వడ్లకొండ రవి, కజ్జం శంకర్, రేపాల ఉమాదేవి, సిరిపురం రమేష్, మాడిశెట్టి సురేందర్, ఓడ్నాల సహేందర్, కొమురోజు వేణుతో పాటు పలువురు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చు
వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్

రామగిరి ప్రభాతవార్త జీవన ఎరువుల వాడకంతో రైతులు అధిక దిగుబడి సాధించ వచ్చని ని రామగిరి మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు. శనివారం మండలంలోనిఆదివారం పేట రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయము నానో ఎరువుల వాడకము జీవన ఎరువుల వాడకము కిచెన్ గార్డెన్ గురించి రైతులకు అవగాహన శిక్షణ కార్యక్రమము మరియు డెమోనిస్ట్రేషన్ నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. కెవికె శాస్త్రవేత్త వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు ఇంటి ఆవరణలో కిచెన్ గార్డెన్ చేయడం ద్వారా రైతులకు ఎలాంటి రసాయనాలు లేని మంచి కూరగాయలు పండ్లు సాగు చేయడం ద్వారా ఆరోగ్యం పెరుగుతుందని తెలిపారు.శిక్షణ కార్యక్రమంలో ఏఈఓ రమేష్ రైతులు పాల్గొన్నారు.

మంథని వార్త

మాజీ జడ్పిటిసి నాగినేని జగన్మోహన్ రావుకు పరామర్శ
ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మాజీ జడ్పిటిసి నాగినేని జగన్మోహన్ రావును బి ఆర్ ఎస్ నాయకులు పరామర్శించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయనను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో ముత్తారం మండల బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు పోతెపెద్ది కిషన్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ, ముత్తారం సర్పంచ్ సుదాటి రవీందర్ రావు పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు క్రీడా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి
-జేఎన్టీయూ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్
రామగిరి ప్రభాతవార్త:



మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని క్రీడా సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం కళాశాలలో విద్యార్థులకు క్రీడ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలకు ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిత్యం ఏదో ఒక ఆటను దిన చర్యలో భాగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు కావలసిన క్రీడా సౌకర్యాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని, ఆటల్లో పాల్గొనే విద్యార్థుల సంఖ్య పెరగాలని సూచించారు. విద్యార్థులకు షటిల్ బ్యాడ్మింటన్, క్యారం, చేస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిపానాధికారి సుమన్ ఫిజికల్ డైరెక్టర్ పింగిలి కృష్ణారెడ్డి జి. సునీల్, సతీష్ విద్యార్థులు పాల్గొన్నారు

రూ.1.50లక్షల ఎలఓసి అందజేత
ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండల కేంద్రానికి చెందిన పెయ్యాల రాధమ్మ అనారో గ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. వైద్య ఖర్చుల కోసం మంత్రి శ్రీధర్ బాబు ద్వారా సి ఎం ఆర్ ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. మంత్రి శ్రీధర్‌బాబు సి ఎం ఆర్ ఎఫ్ కింద రూ.1.50లక్షల ఎల్ఓసిని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. మంత్రి ఆసుపత్రి సహాయకుడు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాధమ్మ కుటుంబ సభ్యులకు ఈ ఎల్ ఓ సిని అందజేశారు. ఎల్ ఓ సిని మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్‌బాబుకు ఈ సందర్భంగా రాధమ్మ, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ప్రత్యేక పూజలకు పోటెత్తిన భక్తజనం

వేములవాడ, ప్రభాతవార్త:

వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. రాఖీ పండగను స్వగ్రామాల్లో కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకున్న భక్తులు, తిరుగు ప్రయాణానికి ముందు భీమేశ్వర స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయాన్నే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రత్యేకఅభిషేకాలు,అన్నపూజలు,కుంకుమ పూజలు నిర్వహించారు. గండ దీపంలో నూనె పోసి స్వామివారికి తమ మొక్కులను భక్తిశ్రద్ధలతో తీర్చుకున్నారు.

రద్దీతో కళకళలాడిన ఆలయ పరిసరాలు

రాఖీ పౌర్ణమి నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. పండగ ముగించుకొని స్వస్థలాలకు తిరిగి వెళ్లే ముందు స్వామివారిని దర్శించుకోవడం



ఆనవాయితీగా కొనసాగుతోంది. దీంతో భీమేశ్వరాలయంలో ఉదయం నుంచి భక్తుల రద్దీ కనిపించింది.

భక్తుల భద్రతకు ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థాన అధికారులు, ఎస్పీఎఫ్ పోలీస్ సిబ్బంది సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు భక్తులకు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. రాఖీ పౌర్ణమి అనంతరం కూడా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో భీమేశ్వర స్వామి ఆలయం భక్తుల సందడితో కళకళలాడింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి: భాజపా డిమాండ్

సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన దీక్ష

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:



రాష్ట్రంలో పేరుకుపోయిన రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన దీక్ష చేపట్టారు. భాజపా రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన 'ఫీజుల బకాయి – బీజేపీ లడాయి' పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అధ్యక్షతన జరిగిన దీక్షా శిబిరంలో నాయకులు పాల్గొని ప్రభుత్వ వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఫీజుల బకాయిలను చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం, భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం తగదని, పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేసి వారికి న్యాయం చేయాలని హెచ్చరించారు.బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఫీజులు రాక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, విద్యార్థుల పక్షాన యువమోర్చా రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ పోరాటంలో జిల్లా ఇన్‌ఛార్జి గంగిడి మోహన్ రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారు.కార్యక్రమంలో భాజపా రాష్ట్ర నాయకులు ఎర్ర మహేష్, లింగంపల్లి శంకర్, కుమ్మరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శీలం రాజు, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి కర్నె హరీష్ పాల్గొన్నారు. అలాగే వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు ఉడుగుల యాదగిరి (ఎస్సీ మోర్చా), రేగుల సంతోష్ బాబు (ఓబీసీ మోర్చా), మలోత్ సాయికిరణ్ నాయక్ (ఎస్టీ మోర్చా), జలపతి రెడ్డి (కిసాన్ మోర్చా), మండల అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి, మీరాల్కర్ బాలాజీ, సొల్ల క్రాంతికుమార్, వెన్నమనేని శ్రీధర్‌రావులతో పాటు కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దాచారం ఉపసర్పంచ్ కాంగ్రెస్ పార్టీలో చేరిక

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలంలోని దాచారం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ కొడిముంజ అనిత విక్రమ్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరింది.పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో ఉపసర్పంచ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంది. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమెతోపాటు గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నేడు బి ఆర్ ఎస్ సన్నాహక సమావేశం ఏర్పాటు

వీర్నపల్లి, ఆగస్టు 29 ప్రభాత వార్త

పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి బి. ఆర్ ఎస్ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. 420 హామీలతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పరిపాలన చేపట్టి సెప్టెంబర్ రెండవ తారీకు నాటికి 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మన ప్రియతమ నాయకులు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకుసెప్టెంబరు 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలోరేపు ఆదివారం రోజునఉదయం 9 గంటలకు వీర్నపల్లి మండల కేంద్రంలోని గ్రామ కమ్యూనిటీ హాల్లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఇట్టి కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య న్యామ్స్ క్యాబ్ చైర్మన్ కోందూరి రవీందర్ రావు సిరిసిల్ల నియోజకవర్గ పర్యవేక్షకులు తుల ఉమ గారు ముఖ్య అథిదులుగా విచ్చేస్తున్నారు.కావున కార్యక్రమానికి సర్పంచులు,ఉప సర్పంచులు,గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు ,యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయగలరని కోరుచున్నాము.

జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:



జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు, భారతదేశం గర్వించదగిన క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా క్రీడల ప్రాధాన్యత, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం, క్రీడాకారులకు ప్రభుత్వం సమాజం నుంచి అందాల్సిన ప్రోత్సాహంపై పలువురు మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాకీ జాతీయ క్రీడాకారులు, మాజీ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, క్రీడాకారులు బండ సాయి, జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గండికోట సమ్మయ్య,అంబాల ప్రభాకర్,వంతడుపుల రఘు, బుర్ర కుమార్, తిరుపతి శ్రీనివాస్, కౌన్సిలర్ కొలుగూరి సురేష్, మంద రాజేష్, కంకణాల బిక్షపతి, దామెర శ్యామ్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్, బీఎస్పీ సీనియర్ నాయకులు మారపల్లి మొగిలయ్య, గంగారపు రాజయ్య, రాజపల్లి గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకురాలు లక్ష్మి, శనివారం భాస్కర్, శనిగరపు జైపాల్, పూలల ప్రశాంత్, పంజాల అరవింద్, మైస వంశీ, గూడెల్లి సాయి, పంజాల శ్రీరామ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి వార్త

మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీమంత్రి

ధర్మపురి,ప్రభాతవార్త.



ధర్మపురి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు వివిధ కారణాలతో మృతి చెందగా, మృతుల కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం పరామర్శించారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గాదె లక్ష్మ ణ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, రాజారం గ్రామానికి చెందిన మేము నూరి వినీత్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు.అలాగే దమ్మన్నపేట గ్రామానికి చెందిన బోయిని పోషన్న అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించగా, అదే గ్రామానికి చెందిన జగిశెట్టి సాయి అనే యువకుడు ప్రమాదవశాత్తు ఓ భవనం పై నుండి పడి మృతి చెందాడు.మృతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.అలాగే మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరారు.మాజీ మంత్రి వెంట బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సాగునీరు విడుదలకు ఎమ్మెల్యేకు రైతుల వినతి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త :



మధ్య మానేరు కుడికాలువ నుండి సాగు నీటిని విడుదల చేయాలని వల్లంపట్ల గ్రామ రైతులు శనివారం స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు విన్నవించుకున్నారు.పలు అభివృద్ధి కార్యక్రమాల ఆరంభోత్సవములో భాగంగా వల్లంపట్ల గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే ను రైతులు వేడుకున్నారు.నీటి విడుదల వల్ల వల్లంపట్లతో పాటు వంతడుపుల, కిష్టారావు పల్లె రంగంపేట,గాలి పెల్లి తదితర గ్రామాల రైతులకు లబ్ధి చేకూరుతుందని రైతులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. నీటి విడుదల కోసం గతంలో వంతడుపుల గ్రామ శివారు బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించామని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా రైతుల బాధలు అర్థం చేసుకొని వేసిన పంటలు ఎండిపోకుండా ఉండటానికి నీటి విడుదల కోసం కృషి చేయాలని అన్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి కుడి కుడికాలువ ద్వారా నీటి విడుదలకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రైతులుకేతిరెడ్డి వెంకట నర్సింహా రెడ్డి,మహేందర్, భాస్కర్,అనిల్, నాగరాజు, మారుపాక అనిల్, సంపత్,మధు, మల్లయ్య,నర్సయ్య, శంకర్ రాజేందర్ ఉన్నారు.

విధులకు ఆటంకం కలిగించాడని కారోబార్‌పై కేసు నమోదు

పెగడపల్లి, ప్రభాతవార్త:

అయితుపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అయితుపల్లి గ్రామపంచాయతీ కారోబార్‌పై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవీందర్ తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శి మంజుల శనివారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవీందర్ తెలిపారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

■ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

■ అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు

■ శాంతి నగర్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్



పెద్దపల్లి, ప్రభాతవార్త:

ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని 2 వ వార్డ్ శాంతినగర్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) కార్యక్రమాన్ని శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో చేపడుతున్న ఓటర్ల వివరాల పరిశీలన, మ్యాపింగ్, దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, అందుబాటులో ఉన్న రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని తెలిపారు. ఓటర్ల పేరు, చిరునామా, వయస్సు, కుటుంబ వివరాలు తదితర అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఒకే వ్యక్తికి బహుళ ప్రాంతాల్లో ఓటు ఉన్నట్లు గుర్తించిన సందర్భాల్లో నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో నిర్ధారణ చేయాలని ఆదేశించారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించే సమయంలో ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హత కలిగిన ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకునేలా సహకరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, అభ్యంతరాలను స్వీకరించి, వాటిని నిర్ణీత గడువులోగా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి వివరాలను పలుమార్లు పరిశీలించిన తర్వాతే నమోదు, ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, సంబంధిత ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, ప్రక్రియలో ఎలాంటి నిరక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య , తహసిల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, బీఎల్ఓలు, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు

స్మార్ట్‌ఫోన్ల వ్యసనంతో చిదిగిపోతున్న బాల్యం

■ 16 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియాను బ్యాన్ చేయాలి..!

■ సీఎం రేవంత్ రెడ్డికి బాలల హక్కుల ప్రజా వేదిక విజ్ఞప్తి

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:



స్మార్ట్‌ఫోన్ల వ్యసనంతో నేటి తరం పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని, వెంటనే 16 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధించాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం హుజురాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నల్గొండ తదితర ప్రాంతాల్లో ఇటీవల జరిగిన ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన కోసం సెప్టెంబర్‌లో అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రజలు, విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్న వయసులోనే కొందరు మొబైల్స్ మోజులో పడి మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల ఉచ్చులో పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్నెట్ దుష్ప్రభావంతో



యువతలో ద్వేషభావం, విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనలు, హింసాత్మక ప్రవృత్తి పెరుగుతున్నాయన్నారు. రాత్రింబవళ్లు ఫోన్‌కు అతుక్కుపోవడం వల్ల నిద్రలేమి, కంటి చూపు మందగించడం వంటి అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చదువును పక్కనపెట్టి చెడు సావాసాలకు అలవాటు పడటం, పెద్దలు మంచి చెప్పినా ఎదురుతిరిగే మనస్తత్వం పెరగడం బాధాకరమన్నారు. ఆన్‌లైన్ వేధింపులు కూడా భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయని హెచ్చరించారు. పిల్లల చేతికి ఫోన్ ఇచ్చి వదిలేయకుండా వారి అలవాట్లు, స్క్రీన్ సమయంపై తల్లిదండ్రులు కచ్చితమైన పర్యవేక్షణ ఉంచాలి. మితిమీరిన మొబైల్ వాడకం కుటుంబ శాంతికి, భద్రతకు పెను ముప్పు కాబట్టి పిల్లల్లో మానవతా విలువలు, సనాతన ధర్మం పట్ల ఆసక్తి పెంచేలా బాధ్యత తీసుకోవాలి. ఉపాధ్యాయులు సైతం తరగతి గదుల్లో మొబైల్స్‌ను కఠినంగా నియంత్రించి, నైతిక విలువలు పెంపొందించాలని సూచించారు. భవిష్యత్తును నాశనం చేస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, హానికర డిజిటల్ కంటెంట్‌పై ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాలకు బానిసలై సమాజానికి హానికరంగా మారుతున్న వారిపై ఉక్కుపాదం మోపాలని, సాంకేతికత జ్ఞానాన్ని పెంచే సాధనంగా ఉండాలి కానీ, జీవితాన్ని నాశనం చేసే వ్యసనం కాకూడదన్నారు. ఏపీ, కర్ణాటకలను ఆదర్శంగా తీసుకుని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో పిల్లల ఆన్‌లైన్ భద్రత, సోషల్ మీడియా నిషేధంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

రామగుండం కమిషనరేట్ పోలీసుల ఉత్తమ ప్రతిభ

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:

రాష్ట్రస్థాయిలో క్రైమ్ పారామీటర్ల అమలులో రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్ల పనితీరును సమీక్షించిన అధికారులు, అత్యుత్తమ పనితీరు కనబరిచిన యూనిట్లను గుర్తించారు. ఈ క్రమంలో క్లస్టర్-Iలో హైదరాబాద్, క్లస్టర్-IIలో రామగుండం, క్లస్టర్-IIIలో నల్గొండ, క్లస్టర్-4లో సూర్యాపేట పోలీస్ యూనిట్లు మొదటి స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్‌లకు ఈరోజు డీజీపీ సీవీ ఆనంద్ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి, ఉత్తమ ఫలితాలు సాధించాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.



కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ఎండోమెంట్ కమిషనర్

మల్యాల, ప్రభాతవార్త:



ప్రసిద్ధ పుణ్యక్షేతమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎం,హనుమంతరావు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా, కమిషనర్‌కు ఆలయ అధికారులు,పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనానంతరం వేద పండితులు కమిషనర్‌కు శేష వస్త్రంకప్పి ఘనంగా సత్కరించారు. వేదాశీర్వచనాల అనంతరం ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎస్ఐఆర్‌లో అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు అందించాలి

■ ప్రతి ఓటరుకు నోటీసు అందేలా చర్యలు తీసుకోవాలి

■ విచారణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలి

■ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త;





బ్రతికేసము క్షుణ్ణంగా పరిశీలించాలని,ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, వారితో పకడ్బందీగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, పంపిణీ, విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు. జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు పంపిణీ చేయాలని సూచించారు. నోటీసులు అందించిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణకు పూర్తి అవకాశం కల్పించి, వారి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో సుమారు 40 వేల నో మ్యాపింగ్ ఓటర్లు, 1.52 లక్షల అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే నోటీసులు జనరేట్ చేసి, వాటి పంపిణీ ప్రక్రియను చేపట్టామని పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణ ప్రక్రియ కూడా కొనసాగుతోందని, నిర్ణీత గడువులోగా విచారణను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలోని ప్రతి వివరాన్ని నిశితంగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షిస్తూ, నిబంధనల ప్రకారం అనామలీస్, నో మ్యాపింగ్ అంశాలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని డిజిపి ఆనంద్‌కు లేఖ రాసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల పట్టణంలోని పాత బస్ స్టాండ్ సమీపంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదించిన పెట్రోల్,డీజిల్ బంకును తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్ కి లేఖ రాశారు.జగిత్యాల జిల్లా కేంద్రంగా రూపుదిద్దుకోవడంతో పట్టణ విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని,ప్రస్తుతం పాత బస్ స్టాండ్ ప్రాంతం నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి ఇంధన బంకులు లేకపోవడంతో ద్విచక్ర,నలుగు చక్రాల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు.ప్రతి పనికి కొత్త బస్ స్టాండ్ వైపే వెళ్లాల్సి రావడంతో యావర్ రోడ్డుపై ప్రతినిత్యం తీవ్ర ట్రాఫిక్ నిలిచిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు.పాత బస్ స్టాండ్ సమీపంలోని పోలీస్ క్వార్టర్స్ స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ అక్కడ పెట్రోల్ పంప్ ఏర్పాటు చేస్తే వాహనదారులకు తీవ్ర ఉపశమనం లభించడమే కాకుండా,పోలీస్ సిబ్బంది కుటుంబాలకు సైతం ప్రయోజనకరంగా ఉంటుందని జీవన్ రెడ్డి సూచించారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించి గతంలోనే ఎస్పీ స్థాయి అధికారులు అనుమతులు పొందినప్పటికీ,సీల్డ్ టెండర్ల ప్రక్రియలో జాప్యం జరుగుతోందని తెలిపారు. జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నడిచే బంకుల తరహాలోనే పోలీస్ శాఖ బంకులు కూడా నాణ్యతకు వేదికగా నిలుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాయని గుర్తుచేశారు.కాబట్టి డీజీపీ ప్రత్యేక చొరవ తీసుకుని,నిలిచిపోయిన ఈ ప్రక్రియను పునరుద్ధరించి ప్రస్తుత 2026 సంవత్సరంలోనే బంకును అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

నీటి పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

అభ్యర్థులు హాల్ టికెట్లలో తెలిపిన నిబంధనలు పాటించాలి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త;

నీట్ పీజీ-2026 ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్న సందర్భంగా జగిత్యాల జిల్లా యంత్రాంగం అన్ని రకాల పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది. నాచుపల్లిలోని జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో ఈ పరీక్ష జరగనుంది. అభ్యర్థులు ఉదయం 7 గంటల నుండి 8 గంటల 30 నిమిషాల లోపే కేంద్రానికి నివేదించాలని, హాల్‌టికెట్‌లో పేర్కొన్న నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ స్పష్టం చేశారు.పరీక్షను అత్యంత ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తుతో పాటు విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ వసతులు,నిరంతరం పనిచేసే సీసీ కెమెరాలు, నాణ్యమైన ఇంటర్నెట్ సౌకర్యాన్ని సిద్ధం చేశారు. సామాజిక మాధ్యమాల్లో వ్యాపించే పుకార్లు, తప్పుడు ప్రచారాలపై సైబర్ పోలీసుల ద్వారా ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల రాకపోకల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు,కేంద్రం వద్ద ప్రథమ చికిత్స వైద్య సదుపాయాలు,పారిశుధ్య చర్యలు పూర్తి చేశామని,పరీక్షా నిర్వహణకు అభ్యర్థులు, తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పారదర్శకత పాటించాలి

13వ వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి శ్రీనివాస్

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త..జగిత్యాల పట్టణంలోని 13వ వార్డు లింగంపేట్ కౌన్సిలర్ సిరికొండ వరలక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ సిరికొండ వరలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని,రేషన్ కార్డులు పొందడం ప్రజల హక్కని పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాల అమలులో పక్షపాతం లేదా రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేయాలని కోరారు. ప్రజాధనంతో అమలు చేసే పథకాల ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందేలా ప్రచారాలు చేసుకోవడం సరికాదని,ప్రతి అర్హుడికి సమాన ప్రాధాన్యత లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.



శ్రీ సత్య సాయి నిత్యాన్న ప్రసాద సేవ షెడ్ పూర్తికి రూ.5 లక్షలు కేటాయింపు

జగిత్యాల అర్బన్ ప్రభాత వార్త:



జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో శ్రీ సత్యసాయి నిత్యాన్న ప్రసాద సేవ ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు ప్రతిరోజూ ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు.శ్రీ సత్యసాయి నిత్యాన్న ప్రసాద సేవ 2016 ఆగస్టు 28న ప్రారంభమై 2026 ఆగస్టు 28న పది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీ సత్యసాయి సంస్థ సభ్యులు జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో పదేళ్లుగా నిరంతరంగా కొనసాగుతున్న సేవా కార్యక్రమాన్ని శాసనసభ్యులు అభినందించారు.నూతన మాతా శిశు ఆసుపత్రిలో నిత్యాన్న ప్రసాద సేవను కొనసాగించేందుకు గతంలో రూ.5 లక్షలు కేటాయించి షెడ్ నిర్మాణానికి సహకరించినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం షెడ్‌లో వంటగది, నేల నిర్మాణం, భోజనశాల తదితర పనులు పూర్తి చేసేందుకు మరో రూ.5 లక్షలను శాసనసభ్యులు కేటాయించినట్లు పేర్కొన్నారు.నిరంతర సేవా కార్యక్రమానికి సహకరిస్తున్న శాసనసభ్యులు సంజయ్ కుమార్‌కు శ్రీ సత్యసాయి సంస్థ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులను పూర్తి చేసి నూతన మాతా శిశు ఆసుపత్రిలో నిత్యాన్న ప్రసాద సేవను ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్, చిటుమల్ల లక్ష్మీనారాయణ, గుండ రాజశేఖర్, వూటూరి భాస్కర్, అమనగంటి నాగభూషణం, సామ సునీల్, అమిరిశెట్టి ప్రభు పాల్గొన్నారు.

ఘనంగా వైకుంఠ ఉత్సవాలు ప్రారంభం

పాల్గొన్న మాజీమంత్రి రాజేశం గౌడ్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



హైదరాబాద్ నాంపల్లిలోని రామ్ ప్రతాప్ పిట్టి భవన్‌లో గల లక్ష్మీనారాయణ స్వామి బాలాజీ మందిరంలో ప్రముఖ వ్యాపారవేత్త ప్రమోద్ అగర్వాల్ ఆధ్వర్యంలో వైకుంఠ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఆగస్టు 25 నుంచి 30వ తేదీ వరకు కొనసాగే ఈ ఆధ్యాత్మిక ఉత్సవాల్లో మాజీ సీనియర్ మంత్రి,మాజీ తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గోడిసెల రాజేశం గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తమిళనాడుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు తోతాద్రి రామానుజ జీయర్ స్వామీజీని దర్శించుకుని ఆశీస్సులు పొందిన ఆయన,అనంతరం స్వామివారి దివ్య హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో లోక్ జనశక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మినేని వికాస్ కూడా పాల్గొని స్వామీజీ ఆశీర్వచనాలు అందుకున్నారు.అనంతరం గోడిసెల రాజేశం గౌడ్ మాట్లాడుతూ మన సమాజంలో సంస్కృతి, సంప్రదాయాలు ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించడంలో ఇటువంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ప్రజల్లో భక్తిభావం, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించేందుకు ఈ వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు. తోతాద్రి రామానుజ జీయర్ స్వామీజీ దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,ప్రతి ఒక్క కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

వొర్రె, దారి స్థలాల ఆక్రమణపై రైతుల ఆందోళన

న్యాయం చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులకు బాధితుల విజ్ఞప్తి

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ వెల్దుర్తి గ్రామంలోని సర్వే నంబర్ 93లో దారి,వొర్రె స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ శనివారం జగిత్యాల ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాధితులు,రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.సుమారు 25 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 6 ఎకరాల 08 గుంటల భూమిని చల్ల హనుమండ్లు,పశుల గంగన్న,పశుల దేవయ్య,బిరుదుల లింగయ్యలకు విక్రయించగా, ఆ సమయంలో కొనుగోలుదారుల రాకపోకల కోసం వదిలిన దారి,పూర్వకాలం నుంచి వినియోగంలో ఉన్న వొర్రె స్థలం కలిపి సుమారు 30 గుంటల భూమి ఉమ్మడి అవసరాల కోసం ఎవరి పేరునా పట్టా చేయకుండా ఉంచారు. అయితే,ప్రస్తుతం ఆ భూమి విక్రయించిన వ్యక్తి వారసురాలు ఆ దారి,వొర్రె స్థలాన్ని సాదా బైనామా ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఆక్రమించేందుకు కుట్ర పన్నుతోందని రైతులు ఆరోపించారు.వొర్రెకు సంబంధించిన స్థలం సర్వే నంబర్లు 211,91,92 పరిధిలో ఉన్నప్పటికీ, రెవెన్యూ అధికారులతో కలిసి వచ్చి తమ భూమిలోనే వొర్రె ఉందంటూ కొత్తగా దారి చూపించే యత్నం చేశారని వారు తెలిపారు.ఈ అక్రమ యత్నాలను అడ్డుకోవడంతో పోలీసులు తమపై కేసులు నమోదు చేయడమే కాకుండా కుటుంబ సభ్యులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారని వాపోయారు.ఈ వివాదం వల్ల తమకు సుమారు 8 గుంటల భూమి నష్టపోవడంతో పాటు పొలాలకు నీరు పోయే మార్గం మూసుకుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ,పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పాత రికార్డులు,సర్వే వివరాలను సమగ్రంగా విచారించి వొర్రె,దారి స్థలాలపై వాస్తవాలను నిర్ధారించాలని,తమ భూములకు న్యాయపరమైన రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామస్తులు ములాసపు లింగయ్య,ములాసపు రాజాం,ములాసపు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనను ఎండగడుతూ సెప్టెంబర్ 2వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జీవన్ రెడ్డి గారు, జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు గారు, జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావసంత సురేష్ గారు పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు ప్రతి బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్త, బీఆర్ఎస్ సైనికుడు సెప్టెంబర్ 2 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వెయ్యి రోజుల విఫల పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం.. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేద్దాం!

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం,తెలుగు భాష దినోత్సవం

జూలపల్లి,ప్రభాతవార్త:జూలపల్లి మండలం తేలుకుంట గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం,తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు కే.రవీందర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా హెచ్ఎం రవీందర్, వ్యాయామ ఉపాధ్యాయులు దాసరి రమేష్ మాట్లాడుతూ క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు,శారీరక విన్యాసాలు నిర్వహించారు.తెలుగు ఉపాధ్యాయులు వ్యాస కృష్ణ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవ విశిష్టతను తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సంజీవరెడ్డి,కే. శ్రీనివాస్,మూల శ్రీనివాస్, శ్రీగిరి గోపాల్,సి.ఆర్.పి సతీష్,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

గంజాయి సాగు గుర్తిస్తే కఠిన చర్యలు

- చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలి

జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్డీ) సమావేశంలో అదనపు కలెక్టర్

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్డీ) సమావేశంలో ఆయన పాల్గొని జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, యువత జీవితాలను మాదకద్రవ్యాల మహమ్మారి నాశనం చేస్తోందని, సరదా కోసం కూడా ఎటువంటి మత్తు పదార్థాలు చెడు అలవాట్లకు అలవాటు పడవద్దని సూచించారు. ఒకసారి మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం గంజాయి సాగుదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు



అందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.డ్రగ్స్ విక్రయం, కొనుగోలు, నిల్వ, అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో మాదకద్రవ్యాలకు సంబంధించిన ప్రతి వివరాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమాలతో పాటు డ్రగ్స్ దుష్పరిణామాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాలు, రవాణా కేంద్రాల వద్ద తరచూ తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసైన వారు చికిత్స పొందేందుకు రామగుండం ప్రభుత్వ ఆసుపత్రిలోని డీఅడిక్షన్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని అన్నారు. డీఅడిక్షన్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డ్రగ్స్ విక్రయం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, సెక్షన్ పర్యవేక్షకులు ధీరజ్ , జిల్లా పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ల

సన్న రకం విత్తనాలు ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి

ఏవో భాస్కర్



ఓదెల, ప్రభాతవార్త:ప్రభుత్వం బోనస్ ప్రకటించిన ఏడు సన్న రకాల వరి విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేస్తున్న రైతులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సెప్టెంబర్ 10, 2026లోపు తప్పనిసరిగా తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.వరి విత్తనాలు కొనుగోలు చేసిన సంబంధిత విత్తన దుకాణాన్ని సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని ఇందుకోసం పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు, విత్తనాల కొనుగోలు రశీదు తీసుకెళ్లాలని సూచించారు.అదేవిధంగా కౌలు రైతులు కూడా తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని భాస్కర్ తెలిపారు. వివరాలు నమోదు చేసుకున్న కౌలు రైతులకు వరి బోనస్ మొత్తం నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని పేర్కొన్నారు.విత్తన దుకాణాల్లో కాకుండా ప్లాంట్ లేదా ఇతర రైతుల వద్ద నుంచి విత్తనాలు తీసుకుని సాగు చేసిన రైతులు తమ గ్రామానికి సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు అదేవిధంగా సెప్టెంబర్ 10, 2026లోపు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోనట్లయితే అట్టి రైతులకు బోనస్ వర్తించదని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ స్పష్టం చేశారు. అందువల్ల రైతులు నమోదు చేసుకొని అర్హత పొందాలని అన్నారు.

వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనను ఎండగడుతూ సెప్టెంబర్ 2వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జీవన్ రెడ్డి గారు, జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు గారు, జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావసంత సురేష్ గారు పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు ప్రతి బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్త, బీఆర్ఎస్ సైనికుడు సెప్టెంబర్ 2 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో కార్యాచరణ సమాయత్తం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా వారి వైఫల్యాలను ఎండగట్టడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జగిత్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ధర్మపురి నియోజకవర్గం ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారుఉద్యమ ప్రణాళికను ఖరారు చేయడం పక్కా వ్యూహాత్మక అడుగు కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో క్షేత్రస్థాయి నిరసనలకు సమాయత్తం కావడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతుంది.మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి భవిష్యత్ ఉద్యమ ప్రణాళికను ఖరారు చేశారు.భాతర రాష్ట్ర సమితి సెప్టెంబర్ 2 నుంచి 8 రోజుల పాటు జరిగే నిరసన కార్యక్రమాలపై వివరించారుఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ, మహిళలకు నిరుద్యోగ భృతి వంటి నెరవేరని వాగ్దానాలపై నిలదీయాలని కోరారు ధర్మపురి నియోజకవర్గంలో నిలిచిపోయిన మోలిక వసతులు మరియు ఉపాధి రహిత సమస్యలపై క్షేత్రస్థాయి పోరాటం చేయాలని ఆయన అన్నారుకేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రతి ఇంట్లోనూ గ్రామంలోనూ ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు..

రాబోయే రోజుల్లో ఈ నిరసన ఉద్యమం ధర్మపురి నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఎంతటి ప్రభావం చూపుతుందో చూడాలి.కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ప్రతి గ్రామంలోనూ ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వాన్ని నిలదీసేలా ముమ్మర కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకంలో, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల నాయకత్వంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతామని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది.ఈ సమావేశంలో ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాచాపూర్ లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

జూలపల్లి,ప్రభాతవార్త:



జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామంలో శనివారం తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టినటువంటి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ స్థానిక సర్పంచ్ పెంట కావేరి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కావేరి మాట్లాడుతూ స్మార్ట్ కార్డ్స్ పంపిణి అనేది నిరంతర ప్రక్రియ అని దీని కోసం ప్రజలు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని కార్డ్ రాని వారు ఎవరైనా ఉంటె స్థానిక జిపిఓ కి తెలియజేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాడి మనోహర్ యాదవ్,జిపిఓ రజిత,గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్టాఫ్ అసిస్టెంట్ నుండి డీజీఎమ్ స్థాయికి బ్రహ్మానందం

ఘనంగా వీడ్కోలు, పదవీ విరమణ

కరీంనగర్ బిజినెస్, ప్రభాత వార్త :కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర



బ్యాంక్ లో స్టాఫ్ అసిస్టెంట్ నుండి డీజీఎమ్ స్థాయికి ఎదిగిన వై.బ్రహ్మానందం సేవలు చిరస్మరనీయమని కేడీసీసీబీ, నాఫ్స్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు కొనియాడారు.ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న కేడీసీసీబీ డీజీఎమ్ వై.బ్రహ్మానందంకు బ్యాంక్ యాజమాన్యం శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్ఞాపికలను అందజేసి, పదవీ విరమణ అనంతర జీవితం సుఖమయంగా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పింగళి రమేష్, డైరెక్టర్లు తిరుపతి రెడ్డి, ఎస్.స్వామి రెడ్డి, సీఈఓ ఎన్.సత్యనారాయణ రావు, జనరల్ మేనేజర్ లు బి. శ్రీధర్, మహమ్మద్ రియాజుద్దీన్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు హనుమంత రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయడం హర్షణీయం

ఓదెల,ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ ఉద్యమకారులందరి తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని



ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్, ఎంపీ వంశీకృష్ణ తదితరులు చేస్తున్న కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.250 గజాల స్థలం, ఆసరా పెన్షన్, ఆరోగ్య కార్డులు, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, గౌరవ గుర్తింపు వంటి ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం ఉద్యమకారులకు భరోసా కలిగిస్తోందన్నారు.ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేయాలని ఉద్యమకారుల తరుపున గుండేటి ఐలయ్య యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు.

కిక్ బాక్సింగ్‌లో సత్తా చాటిన సిద్ధార్థ యాదవ్

ఓదెల,ప్రభాతవార్త:



ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన ఓజ్జే విజయమల్లేశం దంపతుల కుమారుడు సిద్ధార్థ యాదవ్ కిక్ బాక్సింగ్‌లో తన చత్తా చాటాడు రాష్ట్రస్థాయిలో 10, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒక్కొక్క కాంస్య పథకంతో మొత్తం 12 పథకాలు సాధించినట్లు తెలిపారు తల్లిదండ్రుల, గోదావరిఖనికి చెందిన శిక్షకుల ప్రోత్సాహం, నిరంతర శిక్షణతోనే తాను ఈ విజయాలను సాధిస్తున్నానని సిద్ధార్థ యాదవ్ తెలిపారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడమే తన లక్ష్యమని అన్నారు గ్రామీణ ప్రాంతం నుంచి కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తున్న సిద్ధార్థను గ్రామస్థులు, క్రీడాభిమానులు అభినందించారు.

మానవత్వాన్ని చాటుకున్న ప్రముఖ బిఆర్ఎస్ నాయకుడు

అంత్యక్రియల ఖర్చులు అందజేసిన కొక్కిరాల రాకేష్ రావు

పరకాల ఆగష్టు 29 (ప్రభాత వార్త)

పరకాల పురపాలక సంఘం పరిధిలోని 14 వ వార్డు లో నిరుపేద కుటుంబానికి చెందిన రాగుల రాజు శుక్రవారం మృతి చెందగా , ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. అత్యంత పేదరికంలో ఉన్న ఆ కుటుంబం రాజు అంత్యక్రియల (దహన సంస్కారాల) ఖర్చులు కూడా భరించలేని దీన స్థితిలో ఉన్న విషయాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కొక్కిరాల రాకేష్ రావు దృష్టికితీసుకెళ్లారు.సమాచారం అందిన వెంటనే కొక్కిరాల రాకేష్ రావు మానవత్వంతో స్పందించారు. కేవలం ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, రాజు శవ యాత్రలో పాల్గొని అంత్యక్రియలు ముగిసేవరకు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. శ్మశానవాటికలోనే ఉండి, దహన సంస్కారాల కార్యక్రమాలను స్వయంగా దగ్గరుండి అన్ని తానై చూసుకున్నారు. అత్యంత కష్టసమయంలో తమకు కొండంత అండగా నిలిచి, అంత్యక్రియల ఖర్చులు భరించడమే కాకుండా



దగ్గరుండి జరిపించిన బిఆర్ఎస్ నాయకుడు కొక్కిరాల రాకేష్ రావుకి మృతుడి కుటుంబ సభ్యులు, ప్రజలుకృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కొక్కిరాల రాకేష్ రావు మాట్లాడుతూ... ఆపదలో ఉన్న తోటి మనుషులను ఆదుకోవడం, కష్టకాలంలో తోడుగా నిలబడడం మనందరి బాధ్యత అని, రాజు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి తన తరపున ప్రగాఢ సానుభూతిని తెలిపినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పాడి భగవాన్ రెడ్డి బండి వెంకటేష్, బొల్లెడ్ల కృపేందర్ రెడ్డి,యువకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో కార్యాచరణ సమాయత్తం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:





తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా వారి వైఫల్యాలను ఎండగట్టడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జగిత్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ధర్మపురి నియోజకవర్గం ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారుఉద్యమ ప్రణాళికను ఖరారు చేయడం పక్కా వ్యూహాత్మక అడుగు కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో క్షేత్రస్థాయి నిరసనలకు సమాయత్తం కావడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతుంది.మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి భవిష్యత్ ఉద్యమ ప్రణాళికను ఖరారు చేశారు.భాతర రాష్ట్ర సమితి సెప్టెంబర్ 2 నుంచి 8 రోజుల పాటు జరిగే నిరసన కార్యక్రమాలపై వివరించారుఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ, మహిళలకు నిరుద్యోగ భృతి వంటి నెరవేరని వాగ్దానాలపై నిలదీయాలని కోరారు ధర్మపురి నియోజకవర్గంలో నిలిచిపోయిన మోలిక వసతులు మరియు ఉపాధి రహిత సమస్యలపై క్షేత్రస్థాయి పోరాటం చేయాలని ఆయన అన్నారుకేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రతి ఇంట్లోనూ గ్రామంలోనూ ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు..రాబోయే రోజుల్లో ఈ నిరసన ఉద్యమం ధర్మపురి నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఎంతటి ప్రభావం చూపుతుందో చూడాలి.కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ప్రతి గ్రామంలోనూ ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వాన్ని నిలదీసేలా ముమ్మర కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకంలో, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుల నాయకత్వంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతామని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది.ఈ సమావేశంలో ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

బాక్సింగ్ లో మెరిసిన ఖేలో ఇండియా క్రీడాకారులు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం,హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను పురస్కరించుకుని క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఖేలో ఇండియా బాక్సింగ్ క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచారు.బాక్సింగ్ పోటీల్లో 32-34 కిలోల విభాగంలో సి.హెచ్.గుణ తేజ్ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించగా, సయ్యద్ ఇస్మాయిల్ ఉద్దీన్ ద్వితీయ స్థానంతో రజత పతకం గెలుచుకున్నారు.అలాగే 54-57 కిలోల విభాగంలో డి.రంజిత్ విక్టర్ స్వర్ణ పతకం సాధించగా,పి.గణక్షిత్ రజత పతకాన్ని సొంతం చేసుకున్నారు.ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను జిల్లా యువజన,క్రీడల అధికారి డాక్టర్ కే.రవికుమార్,ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ ఎన్.నవీన్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల్లో రాణించి జిల్లాకు,రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పోరండ్ల సొసైటీని సందర్శించిన ఎమ్మెల్యే

తిమ్మాపూర్, ప్రభాత వార్త :



తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్)ను మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. అల్గునూరు నుంచి మన్నెంపల్లి గ్రామానికి వెళ్తున్న ఆయన మార్గమధ్యలో పోరండ్ల సొసైటీకి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా ప్యాక్స్ చైర్మన్ గోపు మల్లారెడ్డి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను శాలువాతో సన్మానించారు. అనంతరం సొసైటీ కార్యాలయం, భవనాలను ఎమ్మెల్యే చైర్మన్, డైరెక్టర్లతో కలిసి పరిశీలించారు. సొసైటీ కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవలు, కార్యాలయ నిర్వహణ తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు మరింత చేరువగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా సహకార సంఘాల నిర్వహణ ఉండాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ గోపు మల్లారెడ్డితో పాటు సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల లో ఎంబీఏ, ఎంసీఏ ప్రత్యేక ప్రవేశాలు

ఎడ్యుకేషన్ కేయూ ఆగస్ట్ 29, ప్రభాతవార్త:



కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ప్రత్యేక ప్రవేశాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఎంసీఏలో 12, ఎంబీఏలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3 వరకు ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. యూనివర్సిటీ మహిళా కళాశాలలో ఎంబీఏ ఎంసీఏ స్పాట్ అడ్మిషన్లు కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా పీజీ కళాశాలలో ఎంబీఏలో 40 సీట్లు, ఎంసీఏలో 53 సీట్లు ఖాళీగా ఉన్నాయని మహిళా పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థినులు అసలు ధ్రువపత్రాలతో హాజరై ప్రవేశం పొందవచ్చని తెలిపారు

బైక్ దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

ఆగస్టు 29, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్

:హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి చోరీకి గురైన స్ప్లెండర్ ప్లస్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అనుమకొండ చేయి మచ్చ శివకుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.అరెస్టయిన నిందితుడి వివరాలు మహమ్మద్ సిద్దికి అబూ బక్కర్, తండ్రి పేరు పాషా మియా , వయస్సు 27 సంవత్సరాలు, వృత్తి పండ్ల వ్యాపారి, నివాసం వరంగల్. వివరాల ప్రకారం నిందితుడు హనుమకొండలో పండ్ల వ్యాపారం చేస్తూ రోజుకు సుమారు రూ.500 సంపాదిస్తున్నాడు. నిందితుడు మద్యానికి బానిస అయ్యాడు. తను సంపాదించే డబ్బులు తన కుటుంబ అవసరాలు మరియు జల్సాలకు సరిపోవడం లేదని భావించి గతంలోఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2, సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో 1, మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 4, హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 చొప్పున మొత్తం 8 బైక్ దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి, జైలు నుండి బెయిల్‌పై విడుదలైన అనంతరం నిందితుడు హనుమకొండలో పండ్ల వ్యాపారం చేస్తూ రోజుకు సుమారు రూ.500 సంపాదిస్తున్నాడు. మళ్లీ అదే విధంగా నిందితుడు మధ్యాహ్నం తన జల్సా ల గురించి మరల బైక్ దొంగతనాలకు పాల్పడి, వాటిని విక్రయించి వచ్చిన డబ్బుతో తన అవసరాలు తీర్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో 25082026 తెల్లవారుజామున సుమారు 02:30 గంటలకు, హనుమకొండ బస్టాండ్ ఎదుట పార్క్ చేసి ఉన్న స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను గమనించాడు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో, తన వద్ద ఉన్న డూప్లికేట్ బైక్ తాళం చెవిని ఉపయోగించి బైక్‌ను చోరీ చేసి అక్కడి నుండి పరారయ్యాడు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ మాట్లాడుతూ ప్రజలు తమ ద్విచక్ర వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేసి, తప్పనిసరిగా హ్యాండిల్ లాక్ అదనపు భద్రతా పరికరాలను ఉపయోగించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మచ్చ శివకుమార్ సూచించారు. బైకు దొంగను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బంది క్రైమ్ కానిస్టేబుల్ విజయ్ కాంత్, అశోక్ బాల మహిపాల్, ఏ ఏ ఓ ఎండి సల్మాన్ పాషా, ఎస్సై పరుశరాములు ను హనుమకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ గారు అభినందించారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న సౌత్ సెంట్రల్ రైల్వే జిఎం

ఆగస్టు 29, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్:

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానమును శనివారం సౌత్ సెంట్రల్ రైల్వే జి.ఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన జి.ఎం కి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు ఆధ్వర్యవమున అర్చకులు జిఎం సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ కి మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు, చిత్రపటమును బహూకరించి ప్రసాదములు అందజేశారు. కాజీపేట మరియు వరంగల్ రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేయుటకు ఆలయ అధికారులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమీషనర్ ఎం. రామకృష్ణారావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం రామకృష్ణారావుకు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించారు.

గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

గీత కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలి
గీత కార్మికులకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలి
బిసి రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి
న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్

బోయిన్ పల్లి ప్రభాత వార్త



తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికుల పిల్లలకు విద్యార్థులకు ప్రత్యేకమైన స్కాలర్షిప్లు ఇవ్వాలని ఉన్నత విద్యలో ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో గీత కార్మికుల సమస్యలు ఎక్స్గ్రేషియా కొంతమందికి రాలేదు అని తక్షణమే విడుదల చేయాలని కోరారు. తాటి చెట్టుపై నుండి పడ్డ గీత కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని పేర్కొన్నారు. గీత కార్మిక కార్పొరేషన్ ద్వారా యువతకు ప్రత్యేక రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి నాయకులు మహేష్ సురేష్ వెంకట్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త హనుమాన్ జాతర
పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి: ప్రభాతవార్త



చందుర్తి మండల కేంద్రంలో అటవీ ప్రాంతంలో వెలసిన కొత్త హనుమాన్ కు శ్రావణమాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కొత్త హనుమాన్ స్వామివారి జాతర మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామివారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. సాధు సంజన భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులి సత్యం. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గోప్పే ప్రభాకర్. మాజీ జెడ్పిటిసి నాగం కుమార్. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం. నాయకులు బాశెట్టి భాస్కర్. బ్యాంకు తిరుపతి. ధర్మపురి శ్రీనివాస్. ఎదురుగట్ల అజయ్. పొంచేట్టి శంకర్. నాగుల శంకర్ గౌడ్. పిట్టల బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి

నాప్కబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావ్..

తంగళ్ళపల్లి,ప్రభాత వార్త..

తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని రెడ్డి భవన్ లో బిఆర్ఎస్ పార్టీ మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి 420 హామీలు ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటిని విస్మరించిందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి,సంక్షేమ పనులను పథకాలను ప్రజలకు ఎంతో మేలు చేశాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ప్రతి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త గడప,గడపకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేయడంలో ఎలా విఫలమైందో వివరించాలని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో నీరు లేక వ్యవసాయం పూర్తిగా కుంటువడిందని అన్నారు. రైతులకు యూరియా బస్తాలు అందించిన పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా యూరియా బస్తాలు ప్రతి రైతుకు అందించమన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఎండగట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య,సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి తుల ఉమ,నాప్కబ్ చైర్మన్ కొండూరు రవీందర్రావు,సెస్ చైర్మన్ చిక్కాల రామారావు,పాక్స్ చైర్మన్ బండి దేవదాస్,సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి,వైస్ చైర్మన్ ఎగుమామిడి రమణారెడ్డి, మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య,మాజీ ఎంపీపీ పడిగేల మానస,మాజీ ఏఎంసి చైర్మన్ రవీందర్ రెడ్డి, తంగళ్ళపల్లి ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి,మాజీ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు వలకొండ వేణుగోపాలరావు,గ్రామ శాఖ అధ్యక్షుడు బండి జగన్,మండల నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

విలాసాగర్ లో మార్కండేయ స్వామి శోభాయాత్ర

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో శ్రీ శివభక్త మార్కండేయ స్వామి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. కన్నుల పండుగగా జరిగిన శోభాయాత్రలో మార్కండేయ స్వామి గ్రామ దేవతలు ధరించడానికి నేతన్నలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలోని మొగ్గంపై వస్త్రం నేయడం చూపరులను ఆకట్టుకుంది,ఉదయం స్థానిక శివాలయంలో సామూహిక యజ్ఞోపవీత ధారణ జంజీరాలు ధరించుట కార్యక్రమం నిర్వహించారు, సాయంత్రం స్థానిక శివాలయం నుండి ప్రారంభమైన శోభాయాత్ర గ్రామ నలుమూలల నుండి శ్రీ పోచమ్మ తల్లి ఆలయం,బస్టాండ్ లోని శ్రీ హనుమాన్ ఆలయం మీదుగా తిరిగి శివాలయానికి చేరుకుంది అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య ధ్మశాలి సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

ప్రజల్లో ఉండి ప్రజల సమస్యలను తీర్చుదాం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేటలో నిరసనల సన్నాహక సమావేశం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 29: ప్రభాత వార్త

ప్రభుత్వం మారినా ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే గ్రామాల్లో భరోసాగా నిలుస్తున్నామని ఆ స్ఫూర్తిని అలాగే కొనసాగించాలని ప్రజల సమస్యలను తీర్చడానికి ప్రయత్నం చేయాలనీ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన నిరసనల కార్యక్రమాల పిలుపులో భాగంగా స్థానిక స్టార్ ఫంక్షన్ హాల్లో కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రేవంత్రెడ్డి 420 హామీలు ఇచ్చి 1000 రోజుల్లో మోసంపై పార్టీ ఇచ్చిన నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు చేపట్టే నిరసన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. నాప్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవిందర్రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని నడుపుతున్న తీరుపై ప్రజలు ఒక అంచనాకు వచ్చారని అది కాంగ్రెస్ నాయకులకు కూడా తెలుసని విమర్శించారు. ఇది వరకే ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి లంకెబిందెల కోసం వచ్చామని ఇక్కడేమీ లేవని పబ్లిక్ వేదికలపై చెప్పిన మాటలను గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందినకాడికి దండుకునే పనిలో ఉన్నారని ఇక భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ అధికారం రాలేదనే విశయం కాంగ్రెస్ కార్యకర్తలకు అర్థమైపోయిందని ఘాటుగా విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి తుల ఉమ మాట్లాడుతూ సిరిసిల్ల నియోజక వర్గంలోని ప్రజలు చైతన్య వంతులని మోసం చేసిన తీరుపై ఇది వరకే వారు సోయిలో ఉన్నారని ఏఏ వర్గాలను ఎలా ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసిందో కొంత అవగాహన కల్పిస్తే సరిపోతుందని తెలిపారు. ప్రతి నిరసన కార్యక్రమం విజయవంతం అయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వర్స కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్రావు, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, మాజీ సెస్ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

దుకాణ యజమానులతో సమావేశమైన విద్యాధికారి

వీణవంక, ప్రభాత వార్త:



వీణవంక మండలము చల్లూరు గ్రామములోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థలములో అదే గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా దుకాణ సము దాయలను నిర్మించుకొన్నారనీ సామాజిక వేత్త ఎం.రఘునాథ రెడ్డి ఫిర్యాదు మేరకు శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా విద్యాధికారి చైతన్య జైనీ దుకాణ యజమానులతో సమావేశమయ్యారు. సమావేశములో దుకాణ దారుల చర్చల నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

వీణవంకలో ఓటర్లకు నోటీసులు

అయోమయంలో ఓటర్లు

వీణవంక, ప్రభాత వార్త:



వీణవంక మండల కేంద్రంలో నీ ముసాయిదా జాబితాలోని ఓటర్లకు నోటీసులు అందడం తో ఓటర్లు అయోమయానికి గురయ్యారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణ లో వీణవంక లోని 103,104,105,106 బూత్ లలో నీ 643 మందికి నోటీసులు రావడంతో బి ఎల్ ఓ ల నిరక్ష్యంతో ఇంతమందికి నోటీసులు వచ్చాయని ఓటర్లు ఆవేదనవ్యక్తం చేశారు. ఈ జాబితాలో పేరు,తండ్రి పేరు, మ్యాపింగ్, వయస్సు 2002 ఓటరు లిస్ట్ లో తేడాలు పలు కారణాలతో నోటీసులు అందజేసినట్లు మండల తహసిల్దార్ ముద్దసాని రమేష్,రెవెన్యూ పరిశీలకుడు సతీష్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసారపు సరోజన రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ తాళ్ళ పల్లి మహేష్,పంచాయితీ కార్యదర్శి యశోద, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలను జయప్రదం చేయండి

బోయిన్ పల్లి మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయిన్ పల్లి మండలంలో మండల స్థాయి క్రీడా పోటీలను సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి మూడవ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ ఒకటవ తేదీ నాడు అండర్ 14 ఇయర్స్ అండర్ 17 ఇయర్స్ బాలబాలికల కబడ్డీ పోటీలు అండర్ 14 17 ఇయర్స్ బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలు జడ్పీ హెచ్ఎస్ నర్సింగాపూర్ పాఠశాల గ్రౌండ్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ రెండవ తేదీ అండర్ 14 అండర్ 17 ఇయర్స్ బాలబాలికల కోకో పోటీలు జడ్పీహెచ్ఎస్ విలాసాగర్ పాఠశాల గ్రౌండ్ లో నిర్వహిస్తున్నట్లు ఈ యొక్క ఆటల పోటీలలో పాల్గొనేవారు ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని మండల ఎస్జిఎఫ్ కన్వీనర్ నర్రా శ్రీనివాస్ రెడ్డి పిడి ని సంప్రదించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పిడి మధుకర్ పిఈటి ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ముసుగు తొలిగేది ఎప్పుడో ?

ఆవిష్కరణ చేయకుండా వదిలేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలు

బోయిన్ పల్లి, ప్రభాత వార్త



బోయినిపల్లి మండలం కొత్తపేట గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసినప్పటికీ వాటిని ప్రారంభించడం మర్చిపోయారు. ఇప్పటికైనా అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు . ఈ విషయంపై కొత్తపేట గ్రామ సర్పంచ్ ఇల్లందుల రాజును సమాచారం అడగగా దాదాపు పది రోజుల్లో విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.